Follow: @ANNTELUGU
20-05-2026

# మహా పత్రిక

ANN తెలుగు

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 143 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## జలమండలి మేనేజర్ ఇంట్లో
# ఏసీబీ దాడులు

18 ఎకరాల వ్యవసాయ భూమి.. దాదాపు రూ.100 కోట్ల ఆస్తులు

అధికారికంగా రూ.5.88 కోట్ల ఆస్తి నిర్ధారణ

**హైదరాబాద్, మహా:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జలమండలి జీఎం కుమార్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఆయనకు సంబంధించి భారీగా ఆస్తులు గుర్తించారు. కుమార్ నివాసముంటున్న ఇంటితో పాటు మరో 8 ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు నిర్వహించింది. సంగారెడ్డి , నిజామాబాద్ జిల్లాల్లో 18 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. హైదరాబాద్‌లో 6 ప్లాట్లు, నిజామాబాద్‌లో 3 ఎకరాల భూమి, ఓ ఇంటి పత్రాలు, రూ. 1.10 కోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కుమార్ తన నివాసంలోనే ఏకంగా 2.1 కేజీల బంగారం, 9.2 కేజీల వెండి వస్తువులను అధికారులు గుర్తించారు. కారు, బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఆస్తువ విలువ సుమారుగా రూ.5.88 కోట్లుగా ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే వాటి మార్కెట్ విలువ అధికంగానే ఉన్నట్లు చెబుతున్నారు. కుమార్ అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన ఏసీబీ అదనపు ఆస్తులపై విచారణ కొనసాగుతున్నట్లు వెల్లడించింది.

**టాప్ న్యూస్**



### విజయ్ సర్కారు కుప్పకూలడం ఖాయం
- స్టాలిన్ శాపనార్థాలు
- డీఎంకే శ్రేణులు ఎన్నికలకు రెడీ కావాలని పిలుపు

02



### స్విచ్‌లు నొక్కడం తప్ప జగన్ చేసిందేమీ లేదు
- వైఎస్ షర్మిల ఫైర్
- వైఎస్సార్ ఆశయాలకు జగన్ తూట్లు

02



### వచ్చే ఎన్నికల్లో భూమా మౌనిక పోటీ
- మంచు మనోజ్ ప్రకటన

02

# స్పెక్ట్రా అరాచకం

## రియల్ మాఫియా కనుసన్నల్లోనే అధికార యంత్రాంగం

స్పెక్ట్రా, మహాసిటీ, గెలాక్సీ పేర్లతో రక రకాల ప్రకటనలు, సినీ తారల పేర్లతో బ్రోచర్లు ముద్రించి రెండు వేల ఎకరాలకు పైగా అమాయకులకు అంటగట్టి రియల్ మాఫియా కోట్ల రూపాయలు కొల్లగొడుతోంది. యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట కేంద్రంగా స్పెక్ట్రా అరాచకం పెట్రేగిపోతోంది. రియల్ మాఫియా కనుసన్నల్లోనే అధికార యంత్రాంగం పనిచేయటంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేసి జారీ చేయాల్సిన ఎన్వోసీలను నకిలీవి సృష్టించి డీటీసీపీ అనుమతులు అడ్డదారిలో పొందింది. అధికారుల ధన దాహానికి పలు గోని చెరువు కబ్జా కు గురైందని బహిరంగా చర్చ జరగటంతో ఆలస్యంగా కళ్లు తెరిచిన ఇరిగేషన్ అధికారులు నామ మాత్రంగా కేసులు పెట్టి చేతులు దులుపుకున్నారని స్థానికంగా విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి... రియల్ మాఫియా పెద్ద పెద్ద కొండలన్నీ జిలిటెన్ స్టిక్ లతో పిండి చేస్తుంటే బాంబుల మోతలతో సమీప గ్రామాలు దద్దరిల్లిపోతున్నాయని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

### నకిలీ ఎన్వోసీలతో డీటీసీపీ అనుమతులు
### పలుగోని చెరువు ఆనవాళ్లు గల్లంతు

ఆలస్యంగా కళ్లు తెరిచిన ఇరిగేషన్ అధికారులు

కొండలను పిండి చేస్తున్న రియల్టర్లు.. బాంబుల మోతలతో దద్దరిల్లుతున్న సమీప గ్రామాలు

డిటిసిపీ అనుమతులు రద్దుచేయాలి .. ఆగని రిజిస్ట్రేషన్ల అక్రమ దందా,

కోట్లు కొల్లగొడుతున్న సబ్ రిజిస్ట్రార్.. గ్రీన్ బెల్ట్ స్థలం ఎక్కడ..?

**ప్రత్యేక ప్రతినిధి, మహా :**

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరి గుట్ట మండలం మాసాయిపేట గ్రామ సరిహద్దుల్లో స్పెక్ట్రా, మహాసిటీ, గేలాక్సీ పేర్లతో రియల్ మాఫియా మోసాలకు పాల్పడుతోంది. సర్వే నెంబర్లు 726,776లలో 82ఎకరాల్లో లే అవుట్ నిర్మాణం చేయటానికి డిటిసిపీ అనుమతుల కోసం ఇరిగేషన్ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి అడ్డదారిలో అనుమతులు పొందినట్లు బహిరంగ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దాంతో కళ్లు తెరిచిన ఇరిగేషన్ అధికారులు ఆగమేఘాలమీద ఫోర్జరీలకు పాల్పడిన సుంకోజు మదన్ మోహన్, సుంకోజు కృష్ణ సాయి, సుంకోజు సృజన్, సుంకోజు సురేష్ జంగం అను వ్యక్తులపై స్థానిక పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేయించారు. అంతవరకూ బాగానే ఉంది. సర్వే నెంబర్లు 726,776లో 82ఎకరాల విస్తీర్ణంలో లే అవుట్ నిర్మాణం సాగుతున్నప్పటికి... లే అవుట్ కు ఎటువంటి పేరుపెట్టకుండా

2వ పేజీలో



## పాలమూరు-రంగారెడ్డి పూర్తికి
# పట్టుదలతో పనిచేయాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం

ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలతో సమీక్ష



**హైదరాబాద్, మహా :** పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలతో మంగళవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి కీలక సూచనలు చేశారు. దీంతోపాటు జిల్లాలోని ఇతర ప్రాజెక్టుల విషయంలోనూ భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. జిల్లాలోని ప్రాజెక్టుల భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పెండింగ్ బిల్లులను చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, తూడి.మేఘారెడ్డి, రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ మార్క్



### యాదగిరిగుట్టలో తెలంగాణ కేబినెట్

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర మంత్రివర్గ సమావేశంపై సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర నిర్ణయం తీసుకున్నారు. గతంలో సమ్మక్క సారలమ్మ ఆలయం వద్ద కేబినెట్ భేటీ నిర్వహించిన సీఎం ఇపుడు మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈసారి యాదగిరి గుట్టను వేదికగా ఎంచుకున్నారు. తెలంగాణ కేబినెట్ సమావేశాన్ని 21వ తేదీ నుంచి 23వ తేదీకి మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 21వ తేదీన సరస్వతి అంత్య పుష్కరాలు ఉన్ననేపథ్యంలో 21నుంచి 23కు మార్చింది. 23న యాదగిరిగుట్టలో కేబినెట్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే, 23న యాదగిరిగుట్టలో వేద పాఠశాలను సీఎం ప్రారంభించనున్నారు. సీఎం నిర్ణయం ఆసక్తికరంగా మారింది, కేబినెట్ భేటీతో యాదగిరి గుట్ట ప్రాంతంలో మళ్ళీ ప్రగతి జోరు పెరుగుతుందని భావిస్తున్నారు.




## ట్రెండింగ్‌లో కాక్రోచ్ జనతా పార్టీ

**మహా:** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చేసిన ఓ వ్యాఖ్య.. ఇప్పుడు సోషల్ మీడియాలో ఓ కొత్త రాజకీయ ఉద్యమానికి దారితీసింది. 'మై భీ కాక్రోచ్' (నేను కూడా బొద్దింకనే) అనే నినాదంతో 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆన్‌లైన్‌లో సంచలనం సృష్టిస్తోంది. యువత ఎదుర్కొంటున్న సమస్యలను వ్యంగ్యంగా, హాస్యంగా ప్రస్తావిస్తూ ఈ పార్టీ లక్షలాది మందిని ఆకర్షిస్తోంది. మే 15న ఓ కేసు విచారణ సందర్భంగా సీజేఐ సూర్య కాంత్, ఉపాధి లేని యువతను ఉద్దేశించి "కాక్రోచెస్ (బొద్దింకలు)" లాగా ఉన్నారంటూ వ్యాఖ్యానించారని మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే, ఆ మరుసటి రోజే ఆయన స్పందిస్తూ, తన వ్యాఖ్యలను తప్పుగా ప్రచారం చేశారని, దేశ యువతను కాకుండా నకిలీ డిగ్రీలతో న్యాయవృత్తిలోకి వచ్చేవారిని ఉద్దేశించి అన్నానని స్పష్టత ఇచ్చారు. యువతను "వికసిత భారతానికి స్తంభాలు" అని ప్రశంసించారు.


మిగతా 2లో

## పెట్రో బాదుడు.. ట్రైలరే

*మరో రూ.13-17 పెరిగే ఛాన్స్*



**మహా:** కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఇంధన ధరలను రెండు సార్లు పెంచారు. ఇంతకు ముందు లీటర్ పెట్రోల్, డీజిల్ ధరలను రూ.3 మేర పెంచగా, మంగళవారం మరో 90 పైసలు మేర వడ్డించారు. అయినప్పటికీ ప్రభుత్వ రంగ చమురు కంపెనీలకు వస్తున్న నష్టాలను పూడ్చడానికి ఈ పెంపు ఏమాత్రం సరిపోదని కోటక్ భావిస్తోంది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు గరిష్ఠ స్థాయికి చేరుకున్న నేపథ్యంలో, దేశంగా పెట్రో ధరలు మరింత భారీగా పెంచాల్సిన అవసరం ఉందని ప్రముఖ బ్రోకరేజీ సంస్థ 'కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్' స్పష్టం చేసింది. దేశీయ చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) ఎదుర్కొంటున్న ఆర్థిక నష్టాలను నివారించాలంటే ఇది తప్పనిసరి అని పేర్కొంది. ఇటీవల చేసిన పెట్రోల్, డీజిల్‌ల ధరల పెంపు ఏమాత్రం సరిపోదని, లీటరుకు అదనంగా మరో రూ.13 నుంచి రూ.17 వరకు పెంచాల్సి ఉంటుందని కోటక్ అభిప్రాయపడింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు ఇంకా ఇలానే కొనసాగితే పరిస్థితి దారుణంగా ఉంటుందని తెలిపింది. దీంతో ఇప్పటిదాకా పెంచింది ట్రైలరే.. అసలు సినిమా ముందుంది అని కొటక్ చెప్పేసింది.



## పట్టపగలు పది మంది
# చూస్తుండగానే..

స్పా సెంటర్ లోకి చొరబడి భార్యను చంపిన భర్త

కవాడిగూడలో కలకలం

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ నగరంలో మంగళవారం ఒక ఘోర హత్య కలకలం రేపింది. కట్టుకున్న భార్యపై ఉన్న కోపంతో, ఆమె పనిచేస్తున్న చోటికే వెళ్లిన భర్త కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి అతి కిరాతకంగా చంపేశాడు. స్పా సెంటర్‌లోకి చొరబడి ఈ ఘాతుకానికి ఒడిగట్టడం స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం బహదూర్‌పూర్ పరిధిలోని కిషన్‌బాగ్‌లో నివసిస్తున్న బంగి దేబోరా అనే మహిళ కవాడిగూడలోని ఒక ప్రముఖ స్పా సెంటర్‌లో బ్యూటీషియన్‌గా పనిచేస్తోంది. గత కొంతకాలంగా దేబోరా, ఆమె భర్త మధ్య కుటుంబ కలహాలు నడుస్తున్నాయి.

మిగతా 2లో




# స్పెక్ట్రా అరాచకం


స్పెక్ట్రా సిద్ధం చేసిన లే అవుట్


కొండలను పిండి చేస్తున్న రియల్టర్లు

మొదటి పేజీ తరువాయి

గాలిలో విక్రయాలు జరుపుతోంది. అలాగే నకిలీ ఎన్వోసీలు సృష్టించి డిటిసిపీ అనుమతులు పొందింది కాబట్టి స్పెక్ట్రా యాజమాన్యానికి జారీ చేసిన డిటిసిపి అనుమతులు రద్దు చేయాలని ఇరిగేషన్ అధికారులు లెటర్లు రాయాల్సి ఉంటుంది. కానీ రియల్ మాఫియా నోట్ల కట్టలతో నోళ్లు మూయించటంతో అధికారులు చర్యలు తీసుకోలేదని ఇదే అదునుగా భావించిన రియల్ మాఫియా రెచ్చిపోయి అమాయకులకు అంటగట్టి సొమ్ము చేసుకొంటుందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

### పలుగోని చెరువు మాయం

మాసాయి పేట గ్రామ సమీపంలోగల పలుగోని చెరువు రియల్ మాఫియా కబంధహస్తాల్లో చిక్కి అన్యాక్రాంతమైంది. కొండలు, గుట్టలు మీద పడిన ప్రవాహం సెలయేళ్ళలా ప్రవహించి పలుగోని చెరువు లోకి చేరి నిత్యం నిండుకుండలా కనిపిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. సర్వే నెంబర్ 776 లో చెరువు ఉన్నట్లు ఇరిగేషన్ రికార్డుల బట్టి తెలుస్తోంది. కానీ రియల్టర్లతో కుమ్మక్కై ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులు సర్వే నెంబర్ 776 కు బదులు 727వేసి కేసు నమోదు చేయటం, చెరువును మాయం చేసిన రియల్ మాఫియాను కాపాడేందుకే అధికారులంతా రింగయ్యారని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. చెరువు తోపాటు ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్లను మట్టితో పూడ్చి ప్లాటు వేసి అమ్మకాలు జరిపి రియల్ మాఫియా సొమ్ము చేసుకుందని స్థానికులు బలంగా వాదన వినిపిస్తున్నారు.. స్పెక్ట్రా పేరులో నడిపిస్తున్న వెంచర్ కు ఊరు పేరు లేకుండా 82ఎకరాల్లో ప్లాట్లను గాల్లో విక్రయించి రియల్టర్లు వందలకోట్లు కొల్లగొట్టారని ఏ ముగ్గురు కలిసిన ఇదే ప్రధాన చర్చగా జరుగుతుంది. స్పెక్ట్రా యజమాని ఎక్కడా స్క్రీన్ మీద కనిపించడు బ్రోకర్ వ్యవస్థ ఇక్కడ కీలకంగా మారి ఆర్థిక లావాదేవీలు సాగించటం విశేషం.

### గ్రీన్ బెల్ట్ స్థలం ఎక్కడ..?

గ్రీన్ బెల్ట్ స్థలమంటే వేసే వెంచర్ లో 10శాతం గ్రీన్ బెల్ట్ స్థలానికి కేటాయించాల్సి ఉంటుంది. అంటే 82 ఎకరాల్లో 8ఎకరాల రెండు గుంటల భూమిని తీసి మౌళిక సదుపాయాలు అనగా రోడ్లకు, వాటర్ ట్యాంకులు, గుళ్ళు, లైబ్రరీ, వాకింగ్ ట్రాక్, పిల్లలు, పెద్దలు ఆడుకొనేందుకు పార్కులు, ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. 10శాతం తోపాటు మరో 6శాతం గ్రామ పంచాయితీ అభివృద్ధికి గ్రామ పంచాయతీ కార్యదర్శి పేరుమీద గిఫ్ట్ డీడ్ చేసి అప్పగించాల్సి ఉంటుంది. కాని ఒక్క గజం జాగాను కూడా వదలకుండా ప్లాట్లు చేసి విక్రయాలు జరుపుతుంటే గ్రామ పంచాయతీ అధికారులు ఎందుకు అడ్డుకోవటంలేదని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎకరం రు 3 నుండి రు 4 కోట్ల మేరకు ధర పలుకుతోందని 8 ఎకరాల విలువ సుమారు రు 30 కోట్లకు పైగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికార యంత్రంగం తోపాటు జిల్లా ఉన్నతాధికారులు స్పందించి స్పెక్ట్రా సాగిస్తున్న అక్రమ దందాపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు...

### కొండలను పిండి చేస్తున్న రియల్ మాఫియా

మైనింగ్, పోలీస్ శాఖల నుండి ఎటువంటి అనుమతులు లేకుండానే కొండలను, గుట్టలను రియల్ మాఫియా పిండి చేస్తోంది. నిషేధిత జిలిటెన్ స్టిక్స్ ను ఉపయోగించి రాత్రుళ్ళు బ్లాస్ట్ చేయటంతో బండ రాళ్లు సైతం పిండైపోతున్నాయి. దీంతో సమీప గ్రామాలు బాంబుల మోతతో దద్దరిల్లిపోతున్నట్లు బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైనింగ్ అధికారులు రెండేళ్లుగా మైనింగ్ అనుమతులు ఎవరికీ ఇవ్వలేదని వారు స్పష్టం చేస్తున్నారు. కొండలను పిండి చేయటమే కాకుండా రాళ్ళను, పొలాల సరిహద్దుల కోసం కడీలను తయారు చేసి సుదూర ప్రాంతాలకు తరలించి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. రాళ్లను వేరే ప్రాంతానికి తరలిస్తే వాల్టా చట్టం కింద కేసులు నమోదు చేయాల్సి ఉంటుంది.. వాల్టా చట్టాన్ని బండరాల్ల కింద బొంద పెట్టి అక్రమంగా రాళ్లను తరలించటం వెనుక పెద్ద మొత్తంలో చేతులు మారినట్లు బహిరంగ చర్చే జరుగుతోంది. మైనింగ్ బ్లాస్టింగ్ వ్యవహారం పోలీసులకు తెలిసిన వారి మౌనం వెనుక అంతరార్థం ఏంటో చెప్పాలని స్థానికులు నిలదీస్తున్నారు.





# పట్టపగలు పది మంది చూస్తుండగానే..

(మొదటిపేజీ తరువాయి)

రోజూలాగే మంగళవారం ఉదయం కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. తీవ్ర మనస్తాపానికి గురైన దేబోరా, ఆ గొడవను పక్కనబెట్టి తన విధులకు హాజరయ్యేందుకు కవాడిగూడలోని స్పా సెంటర్‌కు వచ్చేసింది.భార్య తనతో గొడవపడి వెళ్లడాన్ని తట్టుకోలేకపోయిన భర్త, ఆమెపై తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయాడు. ఎలాగైనా ఆమెను అంతమొందించాలనే పగతో కత్తితో కవాడిగూడకు బయలుదేరాడు. కవాడిగూడ రత్నదీప్ బిల్డింగ్‌లోని నాలుగవ అంతస్తులో ఉన్న స్పా సెంటర్‌కు చేరుకున్న నిందితుడు, ఒక్కసారిగా లోపలికి చొరబడ్డాడు. అక్కడ పనిచేస్తున్న దేబోరాపై తను వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఆమె తేరుకునేలోపే కత్తితో పలుమార్లు పొడవడంతో, తీవ్ర రక్తస్రావమై దేబోరా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. స్పాలోని ఇతర సిబ్బంది భయంతో కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.

### పోలీస్ స్టేషన్‌లో లొంగుబాటు

కవాడిగూడలో భార్యను దారుణంగా హత్య చేసిన అనంతరం నిందితుడు అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. తాను చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు. మరోవైపు సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాలే ఈ హత్యకు ప్రధాన కారణమని భావిస్తున్న పోలీసులు, కేసు నమోదు చేసుకుని నిందితుడిని పూర్తి స్థాయిలో విచారిస్తున్నారు. పట్టపగలే కవాడిగూడ లాంటి రద్దీ ప్రాంతంలో ఈ దారుణం జరగడంతో స్థానికులు షాక్‌కు గురయ్యారు.

# వచ్చే ఎన్నికల్లో భూమా మౌనిక పోటీ

**హైదరాబాద్, మహా :** వచ్చే ఎన్నికల్లో తన భార్య భూమా మౌనిక పోటీ చేస్తారని మంచు మనోజ్ స్పష్టం చేశారు. ఐక్య ధైర్య సేనా సమితి పేరుతో ఇటీవల ట్రస్టు ఏర్పాటు చేసిన మంచు మనోజ్ దంపతులు... ఈ ట్రస్టు ద్వారా తెలుగు రాష్ట్రాల్లో తమ సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని భావిస్తున్నారు. మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించిన మంచు మనోజ్ ఈ విషయాలపై క్లారిటీ ఇచ్చారు.ఐక్య ధైర్య సేనా సమితి రాజకీయ సంస్థ కాదన్న మంచు మనోజ్ ఈ సంస్థకు, రాజకీయాలకు సంబంధం లేదని క్లారిటీ ఇచ్చారు. ప్రజల తరుపున, ప్రజా గొంతుకగా ఉండేందుకు ఐక్య ట్రస్టు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ట్రస్టు కోసం సొంత నిధులను ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే వచ్చే ఎన్నికల్లో భూమా మౌనిక పోటీ చేస్తారంటూ మంచు మనోజ్ ప్రకటించారు. ఇప్పటికే తాము రాజకీయాల్లో భాగంగా ఉన్నామన్నారు. మరోవైపు ఐక్య ధైర్య సేనా సమితి ట్రస్టు పేరును జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో ఇటీవల మంచు మనోజ్ ప్రకటింప చేసిన విషయం తెలిసిందే. ఐక్య ట్రస్టు ద్వారా చిన్నారుల దత్తత, రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మే 20వ తేదీ మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా.. ఈ ట్రస్ట్‌ను ప్రారంభించారు.

### భూమా మౌనిక.. ఏ పార్టీ నుంచి పోటీ

మరోవైపు వచ్చే ఎన్నికల్లో భూమా మౌనిక పోటీ చేస్తారంటూ మంచు మనోజ్ ప్రకటించిన నేపథ్యంలో.. ఆమె ఏ పార్టీ నుంచి బరిలోకి దిగుతారనేదీ ఆసక్తికరంగా మారింది. మంచు మనోజ్, భూమా మౌనిక దంపతులు ఇప్పటి వరకూ అధికారికంగా ఏ పార్టీలోనూ చేరలేదు. అయితే భూమా కుటుంబం గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో, టీడీపీలో పనిచేసింది. భూమా నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డిలు వైసీపీలో, టీడీపీలోనూ పనిచేశారు. ఆ కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన భూమా అఖిలప్రియ వైసీపీ నుంచి పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత టీడీపీలో చేరిన అఖిలప్రియ ప్రస్తుతం టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక మంచు కుటుంబానికి కూడా వైఎస్ జగన్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో భూమా మౌనిక పోటీ చేయాలనుకుంటే.. ఏ పార్టీ నుంచి బరిలో ఉంటారనేది ఆసక్తికరంగా మారింది.



# స్విచ్‌లు నొక్కడం తప్ప జగన్ చేసిందేమీ లేదు

**వైఎస్ షర్మిల ఫైర్**

**వైఎస్సార్ ఆశయాలకు జగన్ తూట్లు**

**విజయవాడ, మహా:** వైసీపీ అధినేత, తన సోదరుడు జగన్ పై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారని ఆమె ధ్వజమెత్తారు. వైఎస్సార్ పేరు చెప్పుకుని 'ఒక్క ఛాన్స్' అంటూ సీఎం అయిన జగన్, ఐదేళ్ల పాలనలో కేవలం స్విచ్‌లు నొక్కడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కేవలం బటన్లు నొక్కితే మళ్లీ మళ్లీ సీఎంలు కాలేరని, కనీసం ఎమ్మెల్యేలు, ఎంపీలకు కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వని పరిస్థితి ఉందని మండిపడ్డారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తండ్రి ఆశయాల పేరిట ఓట్లు వేయించుకుని, అధికారంలోకి వచ్చాక ఆ ఆశయాలనే జగన్ నాశనం చేశారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో ప్రజలపై భారాలు మోపిన వైసీపీ నేతలు, ఇప్పుడు ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. జగన్ సీఎం అయ్యాక కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తల ఊపుతూ, అక్రమ పొత్తు పెట్టుకున్నారని షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు.

# దేవాలయాల బంగారంపై కేంద్రం క్లారిటీ

**ఢిల్లీ, మహా:** దేశవ్యాప్తంగా ఉన్న దేవాలయ ట్రస్టులు, మతపరమైన సంస్థల కోసం కేంద్ర ప్రభుత్వం 'గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్' తీసుకురావాలని యోచిస్తున్నట్లు వచ్చిన వార్తలను కేంద్రం తీవ్రంగా కొట్టిపారేసింది. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ పోస్టులు, నివేదికలు పూర్తిగా అబద్ధమని, అవన్నీ ప్రజలను తప్పుదోవ పట్టించేవిగా, నిరాధారమైనవిగా స్పష్టం చేసింది. దేవాలయాల వద్ద ఉన్న బంగారు నిల్వలకు బదులుగా కేంద్ర ప్రభుత్వం గోల్డ్ బాండ్లను జారీ చేయాలని యోచిస్తోందని, ఇందుకోసం గోల్డ్ మానిటైజేషన్ (బంగారం నగదీకరణ)కు సంబంధించిన ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపిందని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ మంగళవారం అధికారికంగా వెల్లడించింది.అలాగే దేవాలయాల గోపురాలు, గర్భ గుడి తలుపులు లేదా ఇతర దేవాలయ నిర్మాణాలపై అమర్చిన బంగారు పూతలను 'భారతదేశ వ్యూహాత్మక బంగారు నిల్వలు' (స్ట్రాటజిక్ గోల్డ్ రిజర్వ్స్ ఆఫ్ ఇండియా)గా పరిగణిస్తారంటూ వస్తున్న వార్తలను కూడా ప్రభుత్వం తోసిపుచ్చింది.
ఇలాంటి వదంతులను, ప్రచారాలను ప్రజలు ఏమాత్రం నమ్మవద్దని కోరింది. ధ్రువీకరించని సమాచారాన్ని వ్యాప్తి చేయడం వల్ల అనవసరమైన గందరగోళం ఏర్పడి, ప్రజలు తప్పుదోవన పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. విధానపరమైన నిర్ణయాలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం కోసం ప్రభుత్వ అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలని సూచించింది. విధానపరమైన ప్రకటనలను అధికారిక పత్రికా ప్రకటనలు (ప్రెస్ రిలీజ్), ప్రభుత్వ వెబ్‌సైట్లు, ధ్రువీకరించిన పబ్లిక్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా మాత్రమే తెలియజేస్తామని స్పష్టం చేసింది.ఇంతకీ గోల్డ్ మానిటైజేషన్ అంటే ఏమిటంటే.. దేవాలయాల్లో ఉన్న బంగారాన్ని బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడం. ఆ బంగారం విలువకు సరిపోయేలా గోల్డ్ బాండ్లు జారీ చేసి, వాటిపై వడ్డీ రూపంలో ఆదాయం అందిస్తారు. సాధారణ పరిభాషలో చెప్పాలంటే 'బంగారాన్ని ఉత్పాదక ఆస్తిగా మార్చడం' లేదా 'బంగారం నగదీకరణ' చేయడమే ఈ పథకం ఉద్దేశం. భారతదేశంలోని హిందూ దేవాలయాలకు పూర్వం రాజులు, జమీందారులు మణులు, మాన్యాలు, బంగారు ఆభరణాలు ధారాళంగా విరాళంగా ఇచ్చేవారు. ఆధునిక కాలంలోనూ ధనవంతులతో పాటు సామాన్య భక్తులు ఇచ్చే కానుకలు కూడా భారీగానే ఉంటాయి. ఇవన్నీ దేవాలయానికి ఆదాయ వనరులుగా ఉంటాయి.

# ట్రెండింగ్‌లో కాక్రోచ్ జనతా పార్టీ





(మొదటిపేజీ తరువాయి)

ఈ నేపథ్యంలోనే బోస్టన్ యూనివర్సిటీలో చదువుతున్న అభిజీత్ దీప్కే అనే విద్యార్థి 'కాక్రోచ్ జనతా పార్టీ'ని ప్రారంభించాడు. 'సెక్యులర్, సోషలిస్ట్, డెమోక్రటిక్, లేజీ' అనేది పార్టీ నినాదం. నిరుద్యోగిగా, సోమరిగా, నిత్యం ఆన్‌లైన్‌లో ఉండేవారు ఈ పార్టీలో సభ్యులుగా చేరవచ్చని వ్యంగ్యంగా ప్రకటించారు. ప్రారంభమైన 48 గంటల్లోనే ఈ పార్టీకి సంబంధించిన వెబ్‌సైట్, గీతం కూడా విడుదలయ్యాయి. ఎక్స్‌లో 40,000, ఇన్‌స్టాగ్రామ్‌లో 5.5 లక్షల మంది ఫాలోవర్లతో దూసుకెళుతోంది. దాదాపు లక్ష మందికి పైగా ఆన్‌లైన్‌లో సభ్యులుగా చేరారు. నీట్ పేపర్ లీక్ వంటి అంశాలపై స్పందిస్తూ విద్యాశాఖ మంత్రి రాజీనామాకు డిమాండ్ చేయడం, సీబీఎస్ఈ రీచెక్కింగ్ ఫీజులు రద్దు చేయాలని కోరడం వంటి చర్యలతో ఇది కేవలం మీమ్ కాదని, యువత గొంతుకగా మారుతోందని స్పష్టమవుతోంది. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు మహువా మొయిత్రా, కీర్తి ఆజాద్ వంటి ప్రముఖులు కూడా ఈ పార్టీలో చేరడం విశేషం. మహువాను "ప్రజాస్వామ్య ఫైటర్"గా పార్టీ స్వాగతించింది. భారత యువత చాలా అవగాహనతో ఉన్నారని, తమ అసంతృప్తిని ప్రజాస్వామ్య పద్ధతిలోనే తెలియజేస్తారని వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పేర్కొన్నాడు.

# విజయ్ సర్కారు కుప్పకూలడం ఖాయం

**స్టాలిన్ శాపనార్థాలు.. డీఎంకే శ్రేణులు ఎన్నికలకు రెడీకావాలని పిలుపు**



**చెన్నై, మహా :** టీవీకే ప్రభుత్వం ఎక్కువ కాలం ఉండదని డీఎంకే అధినేత స్టాలిన్ జోస్యం చెబుతున్నారు. విజయ్ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉందని, డీఎంకే శ్రేణులు ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ పిలుపునిచ్చారు. తిరుచ్చిలో జిల్లా కార్యదర్శులతో జరిగిన సమావేశంలో స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రభుత్వం ఎంతో కాలం నిలబడదు. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటే తమిళనాడు అసెంబ్లీకి కూడా ఎన్నికలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కార్యకర్తలు ఇప్పుడే క్షేత్రస్థాయికి వెళ్లాలి అని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో ఓటమి తాత్కాలికమేనని, సూర్యుడు మళ్లీ ఉదయిస్తాడని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# నవభారత చరిత్రలో సువర్ణాధ్యాయం

- 29.5 శాతం నుంచి 3.9 శాతానికి పతనమైన పేదరికం
- మార్పుకు నాంది పలికిన సమగ్ర సంక్షేమ విధానం
- ఆరోగ్య భద్రతతో ఆర్థిక స్వావలంబన
- సాంకేతిక విప్లవంతో నూరు శాతం పారదర్శకత

**ఢిల్లీ, మహా:** దశాబ్దాలుగా భారతదేశ ప్రగతి రథచక్రాలకు బంధనాలు వేసిన పేదరికం ఇప్పుడు వేగంగా కనుమరుగవుతోంది. ఒకప్పుడు ప్రపంచంలో అత్యధిక పేదలున్న దేశంగా ముద్రపడిన భారత్, నేడు పేదరిక నిర్మూలనలో యావత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోంది. 201112 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 29.5 శాతంగా ఉన్న దేశ పేదరిక రేటు, 202324 నాటికి కేవలం 3.9 శాతానికి పడిపోవడం స్వతంత్ర భారత చరిత్రలో ఒక అపూర్వ ఘట్టం. రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరి పంచుకున్న ఈ కీలక గణాంకాలు, దేశంలో మారుతున్న సామాజిక, ఆర్థిక ముఖచిత్రానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

### మార్పుకు నాంది పలికిన సమగ్ర సంక్షేమ విధానం

పేదరికం అంటే కేవలం జేబులో డబ్బులు లేకపోవడం మాత్రమే కాదు. కనీస నివాసం, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆర్థిక అక్షరాస్యత లేకపోవడం అనే బహుముఖ కోణాల్లో దీనిని చూడాలి. ఈ బహుముఖ పేదరికాన్ని (మల్టీడైమెన్షనల్ పావర్టీ) సమూలంగా రూపుమాపడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఒక సమగ్రమైన వ్యూహాన్ని అద్భుతంగా అమలు చేసింది. కోట్లాది సామాన్య కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపేలా అనేక విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టింది. బ్యాంకింగ్ వ్యవస్థకు ఆమడ దూరంలో ఉన్న అట్టడుగు వర్గాలకు 'జన్ ధన్ యోజన' ద్వారా జీరో బ్యాలెన్స్ ఖాతాలు తెరవడం వారిని దేశ ప్రధాన ఆర్థిక స్రవంతిలోకి తీసుకువచ్చింది. కట్టెల పొయ్యితో అనారోగ్యం పాలవుతున్న కోట్లాది మంది పేద మహిళలకు 'ఉజ్వల యోజన' ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందించి వారి ఆరోగ్యానికి గట్టి భరోసా ఇచ్చింది. గూడు లేని నిరుపేదలకు 'పీఎం ఆవాస్ యోజన' ద్వారా పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వడం, 'స్వచ్ఛ భారత్' స్ఫూర్తితో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించడం ద్వారా పారిశుద్ధ్యాన్ని పెంచి ప్రాణాంతక వ్యాధుల బారి నుంచి పేదలను అద్భుతంగా కాపాడగలిగారు.

### ఆరోగ్య భద్రతతో ఆర్థిక స్వావలంబన

ఒక సామాన్య కుటుంబం పేదరికంలోకి జారిపోవడానికి అత్యంత ప్రధాన కారణం ఆకస్మికంగా వచ్చే భారీ వైద్య ఖర్చులు. ఈ భయాన్ని పారద్రోలడానికి ఉద్దేశించినదే 'ఆయుష్మాన్ భారత్'. ఈ పథకం ద్వారా అట్టడుగు వర్గాలకు ఏటా ఐదు లక్షల రూపాయల ఉచిత ఆరోగ్య బీమా కల్పించి, నిరుపేదలపై వైద్య ఖర్చులనే పెనుభారాన్ని ప్రభుత్వం శాశ్వతంగా తొలగించింది. ఒక మనిషి ఆరోగ్యంగా ఉంటేనే ఆర్థికంగా ఎదగగలడనే వాస్తవాన్ని గుర్తించి అమలు చేసిన ఈ విధానం దేశవ్యాప్తంగా అద్భుత ఫలితాలను ఇచ్చింది.

### సాంకేతిక విప్లవంతో నూరు శాతం పారదర్శకత

గతంలో ప్రభుత్వాలు సంక్షేమ పథకాల కోసం కోట్లాది రూపాయల నిధులు విడుదల చేసినా, అవి క్షేత్రస్థాయిలో ఉన్న నిజమైన లబ్ధిదారుడికి చేరేసరికి మధ్యవర్తుల జేబుల్లోకి వెళ్లేవి. కానీ, నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. డిజిటల్ ఇండియా సాధించిన అతిపెద్ద విజయం 'డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్' (డీబీటీ) వ్యవస్థ. ప్రభుత్వం విడుదల చేసే ప్రతి రూపాయి, ఎలాంటి అవినీతికి తావులేకుండా, ఏ ఒక్క దళారీ ప్రమేయం లేకుండా నేరుగా అర్హులైన పేదల బ్యాంకు ఖాతాల్లోకే జమ అవుతోంది. ఈ సాంకేతిక విప్లవం వల్ల ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టడం శాశ్వతంగా ఆగిపోయి, నిజమైన లబ్ధిదారులకు నూరు శాతం ప్రయోజనం చేకూరుతోంది.

### సంక్షేమం నుంచి సాధికారత వైపు నవభారతం

ఒకప్పుడు ప్రభుత్వ పథకాలు కేవలం తాత్కాలిక ఉపశమనాలుగా మాత్రమే ఉండేవి. కానీ నేటి ప్రభుత్వ విధానాలు ప్రజలకు ఆధారపడే తత్వాన్ని కాకుండా, ఆత్మనిర్భరతను ప్రోత్సహిస్తున్నాయి. మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య భద్రత ద్వారా ప్రజలు తమ కాళ్ల మీద తాము దృఢంగా నిలబడేలా చేస్తున్నాయి. 29.5 శాతం నుంచి 3.9 శాతానికి పేదరికం తగ్గడం అనేది కేవలం కాగితాలపై ఉన్న ఒక అంకె కాదు. ఇది దేశంలోని కోట్లాది మంది పౌరులు చీకటి నుంచి వెలుగులోకి వచ్చారనడానికి, దశాబ్దాల పేదరికపు సంకెళ్లు తెంచుకున్నారనడానికి సజీవ నిదర్శనం. సంక్షేమం అనే బలమైన పునాదిపై సాధికారత అనే మహోన్నత సౌధాన్ని నిర్మిస్తూ, నవ భారతం ప్రగతి పథంలో తిరుగులేని శక్తిగా దూసుకుపోతోందని ఈ అద్భుతమైన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

## పద్మశాలి టౌన్‌షిప్‌కు తాగునీటి సౌకర్యం కల్పించాలి



**కుషాయిగూడ, మహా :** ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధి లోని పద్మశాలి టౌన్‌షిప్‌లో నెలకొన్న తాగునీటి సమస్య ను వెంటనే పరిష్కరించాలని ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి జలమండలి అధికారుల ను కోరారు. టౌన్‌షిప్ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంకజను కలిసి వినతిపత్రం అందజేశారు. 132 ఎకరాల్లో విస్తరించిన టౌన్‌షిప్‌లో 2,400 కుటుంబాలు నివసిస్తున్నాయని, డంపింగ్ యార్డ్ సమీపంలో ఉండటంతో భూగర్భ జలాలు కలుషితమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని తెలిపారు. కలుషిత నీరు తాగడంతో చిన్నారులు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నా రని వివరించారు. టౌన్‌షిప్‌కు తక్షణమే శుద్ధి చేసిన తాగునీటి సరఫరా ఏర్పాటు చేయాలని, అవసరమైతే కొత్త రిజర్వాయర్ నిర్మించాలని, యుద్ధ ప్రాతిపదికన పైప్‌లైన్లు వేయాలని కోరారు. సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటామని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడ తామని ఈడీ పంకజ హామీ ఇచ్చారు.

# శ్రమశక్తి అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ నగరంలోని కొత్త వాడ వాకర్స్ అసోసియేషన్ గోపాల్ స్వామి గుడి తోట మైదానం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రమశ క్తి అవార్డు గ్రహీత, ప్రజా సేవకుడు చిప్ప వెంకటేశ్వర్లు నేతను మంగళవారం ఘనంగా సన్మానించారు. చిప్ప వెంకటేశ్వర్లు సేవలను గుర్తించి ఇటీవలతెలం గాణ ప్రభుత్వం ఈ శ్రమశక్తి అవార్డు అందించారు. పొందిన ను ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా పరపతి సంఘ అధ్యక్షులు కార్యదర్శులు మాట్లాడుతూ ప్రజల పక్షాన ఉంటూ నిరంతరం ప్రజా సమస్యల పై పోరాడుతూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్న చిప్ప వెం కటేశ్వర్లు ను ప్రభుత్వం గుర్తించి మే డే రోజు అవార్డు ఇవ్వడం సంతోషంగా ఉందని మా ప్రాంతానికి పేరు తెచ్చిన మాలో ఒక్కడు చిప్ప వెంకటేశ్వర్లు నేత ను అభి నందించడం జరిగిందన్నారు. గోపాల స్వామి గుడి తోట మైదానం విషయంలో మీ వంతు సహాయ సహ కారాలు ఉండాలని ఆయనను కోరారు. అనంతరం చిప్ప వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎల్లవేళలా ప్రజలతో మమేకమై ప్రజల పక్షాన నిలబడుతూ మంత్రి కొండా సురేఖ మురళీధర్ రావు నేతృత్వంలో డివిజన్ అభి వృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ముఖ్యంగా గోపాల స్వామి గుడి తోట మైదానంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు నా వంతు బా ధ్యతగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గిరి వేణి సారయ్య, కార్యదర్శి మద్రి వెంకటే శ్వర్లు, పులి సుదర్శన్, మాజీ అధ్యక్షులు గరిదాసు జయ ప్రకాష్, పనికిరా సత్యనారాయణ, సిరబోయిన రాజు, అంజయ్య యాదవ్, చిప్ప ఐలయ్య, కోటేశ్వర్ ,రాజు , ఆనంద్, ప్రభాకర్, రాజలింగం , సూర్యనారాయణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మన చరిత్ర, సంస్కృతి పట్ల యువతకు అవగాహన ఉండాలి

**పురావస్తుశాఖ మ్యూజియాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్**



**మహా వరంగల్ బ్యూరో;** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో లో యూత్ అండ్ స్పోర్ట్స్ వారోత్సవాల్లో రెండవ రోజు కార్యక్రమాలలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళ వారం వరంగల్‌లోని పురావస్తు శాఖ మ్యూజియాన్ని సందర్శించి ప్రత్యేక పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) వైవీ గణేష్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ బాల కృష్ణ, పురావస్తు శాఖ ఏడీ బుజ్జి, యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి అనిల్ తదితర సంబంధిత శాఖల జిల్లా అధి కారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువత లో మన భారతదేశం చరిత్ర, సంస్కృతి పట్ల అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన వారసత్వ సంపదను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలను ప్రజలకు చేరువ చేయడంలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని, యువత సామాజిక చైతన్యంతో ముందుకు రావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాళేశ్వరం సరస్వతి నది అంత్య పుష్కరాలకు ఏర్పాట్ల పరిశీలన

**ట్రాఫిక్ ఏర్పాట్లపై మంచిర్యాల డీసీపీ క్షేత్రస్థాయి సందర్శన**



**మంచిర్యాల, మహా :** మే 21 నుండి 12 రోజుల పాటు జరుగు కాలేశ్వరం సరస్వతి నది అంత్య పుష్కరాల ఏర్పాట్లను మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్ తన సిబ్బందితో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం కాళేశ్వరంలో నిర్వహిం చనున్న సరస్వతి నది అంత్య పుష్కరాల నేపథ్యంలో భక్తులు పలు వాహనాలలో రాకపోకలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతు న్నట్లు ఆయన వెల్లడించారు. పర్యవేక్షణలో భాగంగా మంచిర్యాల నుండి కాళేశ్వరం వరకు ఉన్న ప్రధాన కల్వర్టను జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో సమీక్షించా రు. 2026 మే 21 నుండి 12 రోజులపాటు ఈ పుష్క రాలు జరుగుతాయని చెప్పారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలి వెళ్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. పుష్కరాల వెళ్లే ప్రజలకు ఎలాంటి అసౌ కర్యం కలగకుండా ట్రాఫిక్ నిర్వహణను సమర్థవం తంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి ఎస్సై రాజశేఖర్, భీమారం ఎస్సై రాజేందర్ పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ పార్టీలో భారీ చేరికలు

**రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మరియు బిసి విభాగం అధ్యక్షుల ఆధ్వర్యంలో చేరిక**



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మండలం లోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు తెలంగాణ రక్షణ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పాండురంగారెడ్డి, టిఆర్ఎస్ జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు శివకుమార్, ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ, బిఆర్ఎస్ చెందిన నాయకులు 100 మంది టిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత టిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు పార్టీ లో చేరిన వారు బేగరి రాజు. యండి అన్వార్ ఖాన్. మేకగూడెం బిక్షపతి షేక్ మహమ్మద్ నూర్ భాయ్ చాకలి విక్రమ్. బొక్క సురేందర్ రెడ్డి. బొక్క రవీందర్ రెడ్డి. కావలి శ్రీనివాస్ ముదిరాజ్. చాకలి వినోద్ కుమార్. ఎండి ఇనుస్. మాలని రాజు. గాండ్ల సంతోష్. కుమ్మరి జనార్ధన్. బోడ భాస్కర్ మంగలి శివ, ఎండి వినాయక్. ఎండి అలీ.. ఎండి ఏయ్యా. శ్రీకాంత్ తదితరులు చేరారు. టిఆర్ఎస్ పార్టీ అధినేత కవిత మాట్లాడుతూ తెలంగాణలో రాబోయేది టిఆర్ఎస్ ప్రభుత్వమే తెలంగాణ ప్రజలు ముఖ్యంగా యువత తెలంగాణలో మార్పు కోరుకుంటు న్నారు అని తెలిపారు టిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలు తప్పకుండా అమలు చేసితిరుతానని తెలిపారు.

## జిల్లాలో వేగంగా సాగుతున్న మొక్కజొన్న కొనుగోళ్లు

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లాలో మొక్క జొన్న కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. ప్రస్తుతం మొక్కజొన్నకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 2,400గా ఉండగా, స్థానిక మార్కెట్ ధర సుమారు రూ.1,900 గా ఉండటంతో రైతులకు ద్వారా లాభం చేకూరేలా ప్రభుత్వం కొనుగోళ్లు కొనసాగిస్తోంది. ఇప్పటివరకు జిల్లాలోని 21,537 మంది రైతుల నుంచి మొత్తం 1,09,024.50 మెట్రిక్ టన్నుల మక్క జొన్నను కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కొనుగోళ్ల మొత్తం విలువ సుమారు రూ. 261.65 కోట్లుగా నమోదైనట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

## అలెక్స్ జ్ఞాపకార్థం వాటర్ ట్యాంక్...

**ఐటీఐ ఆన్‌లైన్ అడ్మిషనులను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం..**



**మణుగూరు, మహా :** మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మంచినీటి వాటర్ ట్యాంక్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం ప్రారంభించారు. ఇటీవల మృతి చెందిన ఐటీఐ లెక్చరర్ మయ్య శ్రీనివాస్ కుమారుడు అలెక్స్ జ్ఞాపకార్థంగా ఈ మంచినీటి సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు శాశ్వతంగా ఉప యోగపడే విధంగా ఏర్పాటు చేసిన ఈ సదుపాయం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం 202627 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ ఐటీఐ మణుగూరు ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియను ఎమ్మె ల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే పాయం మాట్లాడారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానున్నట్లు కళాశాల అధికారులు తెలిపారు. యువత ఐటీఐ విద్య ద్వారా సాంకేతిక నైపుణ్యాలు పెంపొం దించుకొని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకో వాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి. రవి, సూపరింటెండెంట్ జ్యోతి, రాణి, మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, మైనారిటీ అధ్య క్షుడు రహీం పాషా, సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, తోగ్గుడెం సర్పంచ్ మడకం క్రిష్ణ, సమితి సింగారం ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి దొబ్బల వెంకటప్పయ్య, ఎస్. గణేష్ రెడ్డి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్‌లో నియంత్రణకు పోలీసుల తనిఖీలు




**శ్రీరాంపూర్ / మంచిర్యాల, మహా :** శ్రీరాంపూర్ పోలీస్ సర్కిల్ పరిధిలో మంగళవారం గంజాయి నియంత్రణకు పోలీసుల జాగిలాలతో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. సందర్భంగా సిఐ అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గంజాయి సేవించడం ద్వారా యువత పెడ మార్గం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యువత తోనే దేశ భవిష్యత్తు ముడిపడి ఉందని పేర్కొన్నారు. గంజాయి అమ్మకాలు శ్రీరాంపూర్ సింగరేణి కాలనీ లలో జరుగుతున్నట్టు ప్రజల దృష్టికి వస్తే సమాచారం పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. గంజాయి మీ సేవించడం ద్వారా యువత భవిష్యత్తు నాశనం అవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా పోలీసులు నార్కోటిక్ డాగ్ సహాయంతో శ్రీరాంపూర్ బస్ స్టాండ్ పరిసర ప్రాంతాల్లోని దుకాణాలు, పాన్ షాపులు, వైన్ షాపులు, ఖాళీ స్థలాలు, ప్లే గ్రౌండ్స్‌తో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

### మే 22న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

# జిల్లా స్థాయి సభలు..!

**విజయవంతం చేయాలన్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22న నిర్వహించే జిల్లాస్థాయి సభలను విజయ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవా రం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్ట ర్లు, సంబంధిత జిల్లా అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మే 22వ తేదీన జిల్లాస్థాయి సభలు సమర్ధవంతంగా నిర్వహించాలనే ప్రభుత్వ సూచనల మేరకు రంగారెడ్డి జిల్లాలో జిల్లాస్థాయి సభను నిర్వ హించేందుకు అనువైన వేదికను ఏర్పాటు చేసి ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి సభను ప్రారం భించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాస్థాయి సభలో ప్రజా ప్రతినిధులను భాగస్వా మ్యం చేయాలని, గౌరవ మంత్రులకు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు, ఎమ్మెల్యేలకు ముందస్తు సమాచారం అందించాలని తెలిపారు. జిల్లాస్థాయి సభను రాష్ట్ర గీతంతో ప్రారంభించాలని, గౌరవ ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించాలని, ప్రభుత్వం చే పట్టిన సంక్షేమ పథకాలు చదివి వినిపించాలని సూచించారు. ప్రస్తుతం అమలులో ఉన్న సంక్షేమ అభి వృద్ధి పథకాల పై చర్చించాలని, జిల్లాస్థాయి సభలో ఆర్డీఓలు, తహశీల్దార్, ఎంపిడిఓ, వార్డు సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, రైతులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఉండేలా చూడాలని సూచించారు. మహిళలు వృద్ధులు కూర్చునేందుకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలని, ప్రదర్శన కోసం స్క్రీన్ మరియు ప్రొజెక్టర్ ఏర్పాటు చేయాలని, వేసవి కాలం అయినందున త్రాగునీరు, నీడ కోసం ఏర్పా ట్లు చేయాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సభ బ్యానర్ ప్రదర్శించాలని సూచించారు. అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి జి ల్లాస్థాయి సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ జూమ్ మీటింగ్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)చంద్రా రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి, డీఆర్ఓ శారద, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణ రెడ్డి, సిపిఓ సౌమ్య, డిపిఓ సురేశ్ మోహన్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దళిత రత్న అవార్డుకు ఎంపికైన సామాజిక కార్యకర్త



**బెల్లంపల్లి, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే ప్రతి ష్టాత్మక "దళిత రత్న" అవార్డుకు బెల్లంపల్లిపట్టణానికి చెందిన దళిత గిరిజన ఉద్యమకారుడు, సామాజిక కా ర్యకర్త, యువ *న్యాయవాది మాదరి రాకేష్ ఎంపికై అవార్డును స్వీకరించడం జరిగింది. మంగళవారం నాడు హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర మంత్రివ ర్యులు డా. జి వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా "దళిత రత్న" అవార్డు స్వీకరించడంజరిగింది. ఈ సందర్భంగా అవార్డులు స్వీకరించిన యువ న్యాయ వాది మాదిరి రాకేష్ మాట్లాడుతూ అవార్డుకు ఎంపిక అవ్వడం,రాష్ట్రమంత్రి వివేక్ చేతుల మీదుగా "దళిత రత్న" అవార్డు బహుకరణ జరగడం సంతోషంగా ఉందని,భవిష్యత్తులో మరింత ఉత్సాహంగా పని చేస్తానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ న్యాయవాది మాదరి రాకేష్ ను అభినందించారు. అందుకు కృతజ్ఞతగా మంత్రి వివేక్ ని శాలువాతో మాదరి రాకేష్ సత్కరించారు.

### సారపాక 14వ వార్డులో

## లో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ

**నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు**

**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 14వ వార్డులో నెలకొన్న లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వార్డు సభ్యురాలు కొమరం సావిత్రి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గారికి వినతిపత్రం అందజేశారు.మంగళవారం సారపాక మేజర్ గ్రామపంచాయతీలో కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమం సర్పంచ్ గూగులోత్ కిషోర్ శివరాం నాయక్ నాయకత్వంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా 14వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న లో వోల్టేజ్ సమస్యపై వార్డు మెంబర్ కొమరం సావిత్రి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.విద్యుత్ సరఫరా సమస్య కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారానికి నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు అదనపు విద్యుత్ స్తంభాలు కూడా ఏర్పాటు చేయాలని ఆమె కోరారు.ఈ విషయంపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వెంటనే స్పందించి ఎలక్ట్రికల్ ఏఈ ఉపేందర్‌కు తక్షణమే అంచనా నివేదిక (ఎస్టిమేషన్) సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. నివేదిక అందిన వెంటనే ఎమ్మెల్యే కోటా నిధుల ద్వారా అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు కొమరం సావిత్రి తెలిపారు.లో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి స్పందించి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గారికి, అలాగే సమస్య పరిష్కారానికి కృషి చేసిన సర్పంచ్ గూగులోత్ కిషోర్ శివరాం నాయక్ గారికి వార్డు ప్రజల తరపున కొమరం సావిత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వారాల వేణు, మాజీ మండల అధ్యక్షుడు పూలపల్లి సుధాకర్ రెడ్డి, నాయకులు ఇంగువ రమేష్, మారం వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాలి శ్రీహరి, సీపీఐ నేత పేరాల శ్రీనివాస్, దామెర ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పదవులు అలంకారం కోసం కాదు గొప్ప బాధ్యత.. మల్ రెడ్డి

- **కాంగ్రెస్ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి....**
- **కష్టపడి పనిచేసే వారందరికీ పార్టీలో గుర్తింపు ఉంటుందన్న రంగారెడ్డి...**
- **ప్రభుత్వ పథకాలు పేదలందరికీ అందేలా చూడాలని పిలుపు ..**
- **అభివృద్ధి నిరోధకుల విమర్శలు ఎక్కడికక్కడ ఎండగట్టాలన్న ఎమ్మెల్యే**
- **ఇబ్రహీంపట్నం నియోజకవర్గ మండలాలు, డివిజన్లకు కాంగ్రెస్ నూతన అధ్యక్షుల నియామకం...**
- **ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని సన్మానించిన నూతన అధ్యక్షులు....**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** పదవి అనేది అధికారం చెలాయించడానికి కాకుండా... నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి, ప్రజలకు సేవ చేసేందుకు దక్కిన గొప్ప బాధ్యతగా తీసుకోవాలని ఇబ్రహీంప ట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. కష్ట పడి పనిచేసే కార్యకర్త ఏ స్థాయికైనా చేరుకోవటం కేవలం కాంగ్రెస్ లో మాత్రమే సాధ్యమని చెప్పారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మండలాలు, జీహెచ్ఎంసీ డివిజన్లకు కాంగ్రెస్ పార్టీ నూతన అధ్య క్షుల నియామకం ఇటీవల జరిగింది. ఇబ్రహీంపట్నం మండలానికి రావనమోని లింగం, ఇబ్రహీంపట్నం పట్టణానికి గౌస్ పాష, యాచారం మండలానికి మోతె శ్రీశైలం, మంచాల మండలానికి ఎద్మ నరేందర్ రెడ్డి, అబ్దుల్లాపూర్ మెట్ కు బింగి దేవదాస్ గౌడ్, ఆది బట్ల డివిజన్ కు రజినీకాంత్ గౌడ్, కొంగర డివిజన్ కు చెనగోని రమేశ్ ముదిరాజ్, తుర్కయంజాల్ డివిజన్ కు ఒర్సు శ్రీనివాస్, తొర్రూర్ కోసిగ ఐలయ్య, పెద్ద అంబర్ పేట్ డివిజన్ కు పండుగల రాజు, కుంట్లూర్ డివిజన్ కు బీమగోని భాస్కర్ గౌడ్ లను నియమిస్తూ... పీసీసీ ఇటీవల నియామక ఉత్తర్వులు జారీచేసింది. తమ కృషిని గుర్తించి, పార్టీ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని నూతన అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను శా లువాలతో సన్మానించి, తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక... పేదల సంక్షేమ మే ధ్యేయంగా ఎక్కడాలేని విధంగా కార్యక్రమాలు అమలుచేస్తోందని మల్ రెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి, మంత్రులను ఒప్పించి ప్రత్యేక నిధులతో ఇబ్రహీంప ట్నం నియోజకవర్గం రూపురేఖలు మార్చివేస్తున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, రుణమాఫీ, మహిళలకు ఉచిత ప్రయాణం, రుణ పరిమితి పెంపు, పెన్షన్లు, విద్య, వైద్యంతో పాటు అనేక సంక్షేమ కార్యక్ర మాలను పేదలకు అందిస్తున్నట్లు చెప్పారు. త్వరలో తీసుకురానున్న కుటుంబ బీమా పథకం పేదలకు భరోసాగా నిలువనుందన్నారు. ప్రభుత్వం చేపడుతు న్న ఈ తరహా కార్యక్రమాలన్నీ పేదలకు అందాలంటే ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త కంకణబద్ధులై పనిచేయాలని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గతంలో కంటే రెట్టింపు మెజార్టీ కాంగ్రెస్ సాధిస్తుందన్న మల్ రెడ్డి.... ఆ దిశగా ప్రతీ నాయకుడు, కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్ని కైన నాయకులకు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే.... కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉండి, అభి వృద్ధిని చూసి ఓర్వలేక కొందరు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని చెప్పారు.

### సారపాక సుందరయ్య నగరంలో

## ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సభ

**సుందరయ్య ఆశయాల సాధనకు పోరాటాలు కొనసాగించాలని సీపీఎం నేతల పిలుపు**





**బూర్గంపహాడ్ మహా :** ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక సుందరయ్య నగరంలో ఘనంగా నివాళుల కార్యక్రమం నిర్వహించారు. పాపినేని సరోజన అధ్యక్ష తన జరిగిన ఈ కార్యక్రమంలో మొదట పార్టీ జెండాను సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు ఆవిష్క రించారు. అనంతరం సుందరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి జోహార్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య ఈ దేశానికి ఆదర్శప్రాయ నా యకుడని కొనియాడారు. దేశంలోని ప్రతి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు గౌరవప్రదమైన జీవితం గడపా లని ఆశయంగా పెట్టుకుని భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సుందరయ్య ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు.అగ్రవర్ణ భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ సామాజిక అసమానతలకు వ్యతి రేకంగా పోరాడుతూ దళితులు, గిరిజనులు, కూలీల హక్కుల కోసం జీవితాంతం పోరాటం చేసిన మహానేత సుందరయ్య అని పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలబడి కూలీలకు మెరుగైన వేతనాలు సాధించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు.సుందరయ్య త్యాగాలు ఎప్పటికీ వృథా కావని, ఆయన చూపిన మార్గంలోనే ప్రజలు నడవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతూ ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. ఇందిర మ్మ ఇళ్ల విషయంలో ప్రభుత్వం హామీలు నెరవేర్చకపోతే జూన్ 2న పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని ప్రజ లకు పిలుపునిచ్చారు.సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సుందరయ్య నగరం ఏర్పా టుకు గతంలో సీపీఎం పార్టీ ప్రజల తరపున పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. ఆ ఉద్యమాల ఫలితంగానే సుందరయ్య నగరం ఏర్పడిందని, ప్రస్తు తం అధికారంలో ఎవరు ఉన్నా ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కౌవులూరి నాగమణి, కమటం మరియమ్మ, మీనా, రామ, రమేష్, ఏడుకొండలు, ప్రకాష్, దమయంతి, ఎస్కే సహిద్, మడకం లత, వెంకమ్మ, శివ పాల్గొన్నారు.

# ఆఫ్రికాలో ఎబోలా వైరస్ కల్లోలం...

ఆఫ్రికా ఖండంలోని కాంగో, ఉగాండా సహా పలు దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి మరోసారి తీవ్రరూపం దాల్చడం ప్రపంచ ప్రజారోగ్య వర్గాల్లో ఆందోళనలను రేకెత్తిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత ప్రభుత్వం తక్షణమే స్పందించి ముందస్తుగా అప్రమత్తమైంది. ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వైరస్ ఉనికిని, దాని వ్యాప్తిని తాము నిశితంగా గమనిస్తున్నామని భారత ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు. దేశంలోకి ఈ ప్రాణాంతక వ్యాధి ప్రవేశించకుండా ఉండేందుకు అవసరమైన అన్ని నిఘా చర్యలను ముమ్మరం చేశామని పేర్కొన్నారు. ముఖ్యంగా జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) అంతర్జాతీయ పరిణామాలను నిరంతరం పర్యవేక్షిస్తోందని స్పష్టం చేశారు. ఆఫ్రికా దేశాలైన కాంగో, ఉగాండాలో ఎబోలా వైరస్ కారణంగా ఇప్పటివరకు 90 మంది ప్రాణాలు విడిచారు. దీనికి తోడు మరో 300కు పైగా ఎబోలా అనుమానిత కేసులు నమోదు కావడంతో పరిస్థితి తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) రంగంలోకి దిగింది. ఈ సంక్షోభాన్ని అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటిస్తూ ఆదివారం నాడు ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం కూడా అలర్ట్ మోడ్‌లోకి వెళ్లి, దేశంలో ఏదైనా ఎబోలా అనుమానిత కేసు గుర్తిస్తే వెంటనే స్పందించేందుకు వీలుగా సంసిద్ధత, విమానాశ్రయాల స్క్రీనింగ్ యంత్రాంగాలు, మరియు తక్షణ ప్రతిస్పందన వ్యూహాలను సమీక్షించడానికి ఒక ఉన్నత స్థాయి సమావేశాన్ని






కూడా ఏర్పాటు చేసింది.

ప్రస్తుతం దేశంలో ఎబోలా వ్యాప్తి లేనప్పటికీ, అంతర్జాతీయ ప్రయాణాలు, ప్రపంచ దేశాల మధ్య ఉన్న నిరంతర అనుసంధానం కారణంగా భారత్ ఇలాంటి అంటువ్యాధుల ముప్పు పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఢిల్లీలోని ఎయిమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ రాయ్ తెలిపారు. ప్రస్తుతం మన దేశానికి ఎబోలా ముప్పు తక్కువగానే ఉందన్న ఆయన, గతంతో పోలిస్తే దేశంలో పటిష్ఠమైన విమానాశ్రయ స్క్రీనింగ్ వ్యవస్థలు, వ్యాధి నిఘా యంత్రాంగాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అయినప్పటికీ ప్రపంచంలో ఎక్కడైనా అంటువ్యాధులు ప్రబలితే అవి దేశంలోకి వచ్చే ప్రమాదం పొంచి ఉంటుంది కాబట్టి, ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులను నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కొవిడ్ మహమ్మారి లాగా ఎబోలా గాలి ద్వారా వ్యాపించే వ్యాధి కాదని, ఈ వైరస్ ప్రధానంగా వ్యాధి సోకిన వారి శరీర ద్రవాలతో ప్రత్యక్ష సంబంధం ఏర్పడటం వల్ల, అలాగే అసురక్షిత ఖనన పద్ధతుల ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుందని ఆయన క్లారిటీ ఇచ్చారు. సరైన రక్షణ చర్యలు పాటించకపోతే రోగులకు చికిత్స అందించే ఆరోగ్య కార్యకర్తలు, కుటుంబ సంరక్షకులకు (ఫ్యామిలీ కేర్‌గివర్స్) ఈ వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు.

మరోవైపు, కొవిడ్19 మహమ్మారి తర్వాత భారతదేశ ఆరోగ్య రక్షణ సన్నద్ధత గణనీయంగా మెరుగుపడిందని మేదాంత ఆస్పత్రిలోని ఇంటర్నల్ మెడిసిన్, రెస్పిరేటరీ విభాగాధిపతి డాక్టర్ రణదీప్ గులేరియా అభిప్రాయపడ్డారు. దేశంలో ఇప్పుడు బలమైన ప్రయోగశాలల (ల్యాబొరేటరీల) నెట్‌వర్క్‌లు, అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థలు బలంగా ఉన్నాయన్నారు. అయినప్పటికీ అకారణంగా వచ్చే జ్వరం, తీవ్రమైన రక్తస్రావ లక్షణాలతో వచ్చే అంతర్జాతీయ ప్రయాణికులకు చికిత్స అందించేటప్పుడు ఆస్పత్రులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఎబోలా వ్యాప్తి గురించి భారతీయులు అనవసరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. సాధారణ స్పర్శ, బహిరంగ ప్రదేశాల్లో తిరగడం లేదా సాధారణ ప్రయాణాల వల్ల ఎబోలా వైరస్ ఒకరి నుంచి ఒకరికి వ్యాపించదని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. అయితే, ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు కచ్చితంగా వైద్య పరీక్షలు చేయాలని, అనుమానిత రోగులను వేగంగా వేరుచేసి ఐసోలేట్ చేయాలని చెప్పారు. అలాగే చికిత్స అందించే ఆరోగ్య కార్యకర్తలు తప్పనిసరిగా వ్యక్తిగత రక్షణ పరికరాలను ఉపయోగించడంతో పాటు చేతులను ఎప్పటికప్పుడు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు.వైద్య నిపుణుల సమాచారం ప్రకారం, ఎబోలా వైరస్ ప్రాథమికంగా గబ్బిలాల నుంచి మనుషులకు సోకుతుంది. ఆ తర్వాత ఈ వైరస్ సోకిన వ్యక్తి శారీరక ద్రవాలు, రక్తాన్ని ఇతరులు తాకినప్పుడు ఒకరి నుంచి మరొకరికి ఈ వైరస్ వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. ఈ ప్రాణాంతకమైన ఎబోలా వైరస్ సుమారు 21 రోజులపాటు రోగి శరీరంలో సజీవంగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ వైరస్ బారిన పడిన వారిలో జ్వరం, విపరీతమైన అలసట, నీరసం, కండరాల నొప్పి, తీవ్రమైన తలనొప్పి, గొంతు నొప్పి, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి మరియు చర్మంపై దద్దుర్లు రావడం వంటి ప్రాథమిక లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి ముదిరిన కొద్దీ శరీరంలోని అంతర్గత అవయవాలైన మూత్రపిండాలు, కాలేయ పనితీరు దెబ్బతినడం వంటి అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడతాయని వైద్యులు వివరిస్తున్నారు. ఈ లక్షణాల పట్ల నిఘా ఉంచడం ద్వారా వ్యాధిని ముందే గుర్తించవచ్చని ఆరోగ్య శాఖ పేర్కొంది.


# కమిటీ కూర్పులో.. పాత్రికేయుల పాత్ర!



తుది దశ తెలంగాణ ఉద్యమంలోనే కాకుండా, అంతకుముందు 1990లలో కరువు పీడన, తెలంగాణ దుస్థితిపై తెలంగాణ సమాజాన్ని కదిలించేలా, ఆలోచింపజేసేలా అక్షరాల సేద్యంలో ఉద్యమ పంటలకు బీజం వేశాం..!దినం వెనకా ముందూ నిదానంగానైనా ఒక్కో అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తన ప్రజా పాలనలో ముందర వేసుకుంటున్నది. అదే కోవలోకి వస్తుంది తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు వ్యవహారం. ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మనసు నిలిపి.కే.కేశవరావు చైర్మన్ గా, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు ఆచార్య కోదండరామ్, అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి సభ్యులుగా ప్రత్యేకంగా ఓ కమిటీ వేయడం శుభపరిణామమే.

ఇప్పటికే ప్రజా ప్రభుత్వం వ్యవధిలో సగం కాలగర్భంలో కలిసిపోయినందున ఆ కమిటీ ఉనికిలోకి వచ్చిందే తడవుగా కార్యాచరణలో నిమగ్నమైంది. అనేక మంది నిజమైన తెలంగాణ ఉద్యమకారుల చూపంతా ఒక్కసారిగా తన వైపు తిప్పుకొంది. ఉద్యమకారుల్లో ఎన్నో ఆశలు రేకెత్తిస్తోంది. ఈ క్రమంలో కమిటీ మొట్టమొదటి సమావేశం అందరూ మెచ్చే నిర్ణయాల దిశగా తొలి అడుగు వేసింది. రాజకీయాలకు అతీతంగా ఉద్యమకారుల ఎంపిక జరుగాలని తలపోసింది. అసమానతలకు ఆస్కారం, తావు లేకుండా మెదిలేందుకుఅఖిల పక్షాలతో భేటీ అవ్వాలనీ భావించింది. ఉద్యమకారులను నాలుగు కేటగిరీల్లో ఎంపిక చేయాలని కూడా నిర్ణయించింది. చివరి కేటగిరీలో ఆమోదానికి దిన పత్రికల క్లిప్పింగులనూ ప్రామాణికం చేయాలని చర్చించింది. మరి ప్రింట్ మీడియాలో తెలంగాణ ఉద్యమ కార్యకలాపాలు, ఉద్యమకారుల త్యాగాలు కలకాలం ఉండిపోయేలా రౌండ్ ది క్లాక్ కష్టపడింది ఫీల్డులో అపుడు ఎల్లప్పుడూ అందుబాటులో ఉన్న కలం కార్మికులే. అంటే పాత్రికేయులే. వారి పేరూ, ఉనికీ ప్రత్యేకించి నాటి ఉద్యమ కవరేజీలో ఏమీ ఉండదు. ఒక్క డేట్ లైన్ తప్ప. ముఖ్యంగా 2001 నుంచి 2014 ద్వితీయార్థం దాకా అద్వితీయమైన రిపోర్టింగ్ చేశారు జర్నలిస్టులు. ఆ కాలంలో ఈనాడు వంటి తెలంగాణ అనుకూల లైన్ లేని పత్రికల్లో నా లాంటి వాళ్ళు ఎందరో రిపోర్టర్లు యాజమాన్యాల ప్రచ్ఛన్న ఆంక్షలను, వేధింపులను పంటి బిగువున అదిమి పట్టుకొని వీరోచితంగా తెలంగాణ ఉద్యమ వార్తలు కవర్ చేశాం. మరుసటి రోజు పత్రికల్లో కంపల్సరీ అచ్చు అయ్యేలా డెస్కులకు గ్రౌండ్ లెవెల్ పరిస్థితికి మించి నూరిపోయడం వంటి ఉపాయాలు, మెలకువలు, ఎత్తులు వగైరా అనుసరించాం. ఆ క్రమంలో రకరకాల ఒత్తిళ్లు, మానసిక, శారీరక శ్రమ పడ్డాం. కేవలం ఈవెంట్స్ ఫైలింగ్ తోనే సరిపెట్టకుండా నిరసనలకు రూపు, ఊపూ డిజైన్ చేయడంలో తెలంగాణ ఉద్యమకారులతో చెప్పలేనంత మమేకం అయ్యాం. ఎక్కడ లోటు, వెలితీ అనిపిస్తే అక్కడ తిండీ తిప్పలు మాని వాలిపోయిన విలేకరులం ఎందరిమో. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ,1969, 1972, 1996 ఉద్యమకారులు, ఉద్యోగ సంఘాలు, కళాకారుల జేఏసి, సబ్బండ వర్గాల జేఏసీ, కుల సంఘాలు, న్యాయవాదుల జేఏసీ, వివిధ జిల్లాల్లో ఏర్పడిన ఉద్యమ సంఘాలతోపాటుజర్నలిస్టు సంఘాల నుంచి కూడా కమిటీ ప్రతిపాదనలు సేకరించాలి. తెలంగాణ ఉద్యమంలో అహోరాత్రులు పాటుపడిన కలం కష్టజీవులను కూడా గుర్తించాలి.

మలి, చివరి దశ సుదీర్ఘ ఉద్యమం సాగినంత కాలం పాత్రికేయులుగా నిస్వార్థంతో, నిర్విరామంగా భాగమయ్యాం. తుది దశ తెలంగాణ ఉద్యమంలోనే కాకుండా, అంతకుముందు 1990లలో కరువు పీడన, తెలంగాణ దుస్థితిపై తెలంగాణ సమాజాన్ని కదిలించేలా, ఆలోచింపజేసేలా అక్షరాల సేద్యంలో ఉద్యమ పంటలు వేశాం. ప్రైమ్ టైమ్ జీవితాన్ని ధారపోసి, ఆరోగ్యాన్ని పణంగా పెట్టిఎన్నో త్యాగాలు చేశాం. అదంతా కమిటీకి తెలియనిది కాదు. కమిటీ మదిలోనూ సజీవ సన్నివేశమే. ముఖ్యంగా తెలంగాణ జర్నలిస్టులకు ఆదరణ, గౌరవం, గుర్తింపు, బాగోగులను యాజమాన్యాలు సహా ఇతర వ్యవస్థలు ఓ పట్టాన జీర్ణం చేసుకోవు. విభిన్న అభిప్రాయాలు, ఏవో మనోవికారాలతోనే చూస్తాయి. తెలంగాణ ఉద్యమ వార్తలు కవర్ చేసిన జర్నలిస్టుల్లో కాలం చేసిన వారి కుటుంబాలను, బతికున్న వారిని కమిటీ పెద్ద మనసుతో అక్కున చేర్చుకోవాలి. నాలుగు అంశాల్లో చిట్ట చివరిగానైనా కమిటీ కూర్పులో పాత్రికేయుల పాత్రను, వారికీ మేలు చేయాలనే అంశాన్ని ప్రస్తావించాలి. ఆ విధంగా ప్రభుత్వానికి మనస్కరించేలా చొరవ చూపాలి.



- ఇల్లెందుల దుర్గాప్రసాద్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9440850384

# భారత్‌లో పేదరికం క్షీణత

దశాబ్దాలుగా భారతదేశ ప్రగతి రథచక్రాలకు బంధనాలు వేసిన పేదరికం ఇప్పుడు వేగంగా కనుమరుగవుతోంది. ఒకప్పుడు ప్రపంచంలో అత్యధిక పేదలున్న దేశంగా ముద్రపడిన భారత్, నేడు పేదరిక నిర్మూలనలో యావత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోంది. 201112 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 29.5 శాతంగా ఉన్న దేశ పేదరిక రేటు, 202324 నాటికి కేవలం 3.9 శాతానికి పడిపోవడం స్వతంత్ర భారత చరిత్రలో ఒక అపూర్వ ఘట్టం. రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరి పంచుకున్న ఈ కీలక గణాంకాలు, దేశంలో మారుతున్న సామాజిక, ఆర్థిక ముఖచిత్రానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. పేదరికం అంటే కేవలం జేబులో డబ్బులు లేకపోవడం మాత్రమే కాదు. కనీస నివాసం, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆర్థిక అక్షరాస్యత లేకపోవడం అనే బహుముఖ కోణాల్లో దీనిని చూడాలి. ఈ బహుముఖ పేదరికాన్ని (మల్టీడైమెన్షనల్ పావర్టీ) సమూలంగా రూపుమాపడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఒక సమగ్రమైన వ్యూహాన్ని అద్భుతంగా అమలు చేసింది. కోట్లాది సామాన్య కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపేలా అనేక విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టింది. బ్యాంకింగ్ వ్యవస్థకు ఆమడ దూరంలో ఉన్న అట్టడుగు వర్గాలకు 'జన్ ధన్ యోజన' ద్వారా జీరో బ్యాలెన్స్ ఖాతాలు తెరవడం వారిని దేశ ప్రధాన ఆర్థిక స్రవంతిలోకి తీసుకువచ్చింది. కట్టెల పొయ్యితో అనారోగ్యం పాలవుతున్న కోట్లాది మంది పేద మహిళలకు 'ఉజ్వల



యోజన' ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందించి వారి ఆరోగ్యానికి గట్టి భరోసా ఇచ్చింది. గూడు లేని నిరుపేదలకు 'పీఎం ఆవాస్ యోజన' ద్వారా పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వడం, 'స్వచ్ఛ భారత్' స్ఫూర్తితో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించడం ద్వారా పారిశుధ్యాన్ని పెంచి ప్రాణాంతక వ్యాధుల బారి నుంచి పేదలను అద్భుతంగా కాపాడగలిగారు.

ఒక సామాన్య కుటుంబం పేదరికంలోకి జారిపోవడానికి అత్యంత ప్రధాన కారణం ఆకస్మికంగా వచ్చే భారీ వైద్య ఖర్చులు. ఈ భయాన్ని పారద్రోలడానికి ఉద్దేశించినదే 'ఆయుష్మాన్ భారత్'. ఈ పథకం ద్వారా అట్టడుగు వర్గాలకు ఏటా ఐదు లక్షల రూపాయల ఉచిత ఆరోగ్య బీమా కల్పించి, నిరుపేదలపై వైద్య ఖర్చులనే పెనుభారాన్ని ప్రభుత్వం శాశ్వతంగా తొలగించింది. ఒక మనిషి ఆరోగ్యంగా ఉంటేనే ఆర్థికంగా ఎదగగలడనే వాస్తవాన్ని గుర్తించి అమలు చేసిన ఈ విధానం దేశవ్యాప్తంగా అద్భుత ఫలితాలను ఇచ్చింది. గతంలో ప్రభుత్వాలు సంక్షేమ పథకాల కోసం కోట్లాది రూపాయల నిధులు విడుదల చేసినా, అవి క్షేత్రస్థాయిలో ఉన్న నిజమైన లబ్ధిదారుడికి చేరేసరికి మధ్యవర్తుల జేబుల్లోకి వెళ్లేవి. కానీ, నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. డిజిటల్ ఇండియా సాధించిన అతిపెద్ద విజయం 'డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్' (డీబీటీ) వ్యవస్థ. ప్రభుత్వం విడుదల చేసే ప్రతి రూపాయి, ఎలాంటి అవినీతికి తావులేకుండా, ఏ ఒక్క దళారీ ప్రమేయం లేకుండా నేరుగా అర్హులైన పేదల బ్యాంకు ఖాతాల్లోకే జమ అవుతోంది. ఈ సాంకేతిక విప్లవం వల్ల ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టడం శాశ్వతంగా ఆగిపోయి, నిజమైన లబ్ధిదారులకు నూరు శాతం ప్రయోజనం చేకూరుతోంది.

ఒకప్పుడు ప్రభుత్వ పథకాలు కేవలం తాత్కాలిక ఉపశమనాలుగా మాత్రమే ఉండేవి. కానీ నేటి ప్రభుత్వ విధానాలు ప్రజలకు ఆధారపడే తత్వాన్ని కాకుండా, ఆత్మనిర్భరతను ప్రోత్సహిస్తున్నాయి. మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య భద్రత ద్వారా ప్రజలు తమ కాళ్ల మీద తాము దృఢంగా నిలబడేలా చేస్తున్నాయి. 29.5 శాతం నుంచి 3.9 శాతానికి పేదరికం తగ్గడం అనేది కేవలం కాగితాలపై ఉన్న ఒక అంకె కాదు. ఇది దేశంలోని కోట్లాది మంది పౌరులు చీకటి నుంచి వెలుగులోకి వచ్చారనడానికి, దశాబ్దాల పేదరికపు సంకెళ్లు తెంచుకున్నారనడానికి సజీవ నిదర్శనం. సంక్షేమం అనే బలమైన పునాదిపై సాధికారత అనే మహోన్నత సౌధాన్ని నిర్మిస్తూ, నవ భారతం ప్రగతి పథంలో తిరుగులేని శక్తిగా దూసుకుపోతోందని ఈ అద్భుతమైన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

- గడల నరసింహారావు,
సీనియర్ జర్నలిస్ట్

# సంఘర్షణ లేనిదే విజయం లేదు

## ఫ్రెడరిక్ డగ్లస్ స్ఫూర్తిదాయక మాటల వెనుక గూడార్థం ఇదే...

మనం ఏదైనా సాధించాలనుకున్నప్పుడు ఎదురయ్యే ఆటంకాలను చూసి కుంగిపోతుంటాం. కానీ, అసలు ఆ ఆటంకాలే లేకపోతే మనం సాధించే విజయానికి విలువే ఉండదని దాదాపు రెండు శతాబ్దాల క్రితమే ఫ్రెడరిక్ డగ్లస్ చాటిచెప్పారు. అమెరికాలో బానిసత్వ విముక్తి కోసం పోరాడిన గొప్ప యోధుడు ఆయన. "పోరాటం లేనిదే ప్రగతి లేదు" అన్న ఆయన మాటలు కేవలం ఒక నినాదం మాత్రమే కాదు, అది ఒక జీవన సత్యం.

**స్వేచ్ఛా పోరాట యోధుడు ఫ్రెడరిక్ డగ్లస్ ప్రస్థానం**

ఫ్రెడరిక్ డగ్లస్ 1818 ప్రాంతంలో మేరీల్యాండ్‌లో ఒక బానిసగా జన్మించారు. అక్షరం ముక్క రాని స్థితి నుంచి, తనంతట తానుగా చదువు నేర్చుకుని, 1838లో బానిసత్వం సంకెళ్లను తెంచుకుని పారిపోయారు. ఆ తర్వాత ఆయన అద్భుతమైన రచయితగా, వక్తగా, సంస్కర్తగా ఎదిగారు. బానిసత్వానికి వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోయింది. అబ్రహం లింకన్ వంటి గొప్ప నాయకులకు కూడా ఆయన సలహాదారుగా వ్యవహరించారు. మన దేశంలో సామాజిక మార్పు కోసం పోరాడిన జ్యోతిరావు పూలే లేదా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుల తరహాలోనే, డగ్లస్ కూడా అణచివేతపై గళమెత్తారు. "దున్నకుండా పంటను ఆశించడం ఎంత తప్పో, పోరాటం చేయకుండా మార్పును కోరుకోవడం కూడా అంతే తప్పు" అని ఆయన నిక్కచ్చిగా చెప్పేవారు.



**సంఘర్షణే ప్రగతికి తొలి మెట్టు**

డగ్లస్ 1857లో ఇచ్చిన ఒక ప్రసంగంలో ఈ మాటలు చెప్పారు. అధికారం ఎప్పుడూ తనంతట తానుగా ఏ హక్కునూ వదులుకోదని, మనం అడిగితేనే, పోరాడితేనే ఫలితం ఉంటుందని ఆయన హెచ్చరించారు.

**వ్యక్తిగత ఎదుగుదల:**

భయంపై విజయం సాధించాలంటే సంఘర్షణ తప్పదు.

**సామాజిక మార్పు:**

వివక్షపై పోరాడితేనే సమానత్వం సిద్ధిస్తుంది.

**వృత్తిపరమైన విజయం:**

అసౌకర్యంగా అనిపించే కొత్త విషయాలను నేర్చుకున్నప్పుడే కెరీర్‌లో ఎదుగుదల సాధ్యమవుతుంది. నిజానికి, పాత పద్ధతులను వదిలి కొత్త వాటిని స్వీకరించేటప్పుడు కలిగే ఘర్షణే మనల్ని మరింత బలంగా తీర్చిదిద్దుతుంది. నిశ్శబ్దంగా ఉంటే శాంతి లభిస్తుందని అనుకోవడం పొరపాటని, అది కేవలం అణచివేతకు తలొగ్గడమేనని ఆయన భావించారు.

**నేటి కాలానికి డగ్లస్ మాటలు ఎలా సరిపోతాయి?**

నేటి వేగవంతమైన ప్రపంచంలో ఉద్యోగాలు, సాంకేతికత విపరీతంగా మారిపోతున్నాయి. వరల్డ్ ఎకనామిక్ ఫోరం (WEF) 'ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ రిపోర్ట్ 2025' ప్రకారం, 2030 నాటికి మార్కెట్‌లో అవసరమయ్యే నైపుణ్యాలలో దాదాపు 39 శాతం మార్పులు వస్తాయని అంచనా. అంటే మనం నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవడంలో పడే ఇబ్బందే రేపటి మన భవిష్యత్తుకు పునాది. మరోవైపు, గాలప్ (Gallup) సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా కేవలం 20 శాతం మంది ఉద్యోగులు మాత్రమే తమ పని పట్ల ఉత్సాహంగా ఉంటున్నారు. పని ఒత్తిడి, ఏఐ (AI) వంటి కొత్త మార్పుల పట్ల భయం పెరిగిపోతోంది. ఇలాంటి సమయంలో డగ్లస్ మాటలు మనకు ధైర్యాన్ని ఇస్తాయి. ఏదైనా కష్టంగా అనిపిస్తోందంటే, అది మనం ప్రగతి దిశగా అడుగులు వేస్తున్నామనడానికి సంకేతం మాత్రమే.

**జీవితంలో మార్పు కోసం ఏం చేయాలి?**

డగ్లస్ సూత్రాలను నేటి జీవితానికి అన్వయించుకోవాలంటే ఈ ఐదు మార్గాలను అనుసరించవచ్చు. సమస్యను గుర్తించండి: మీకు అడ్డంకిగా మారిన భయాన్ని లేదా తక్కువ నైపుణ్యాన్ని నిజాయితీగా అంగీకరించండి.పోరాటాన్ని అలవాటు చేసుకోండి: కొత్త విషయాలు నేర్చుకునేటప్పుడు కలిగే అసౌకర్యాన్ని ప్రగతికి చిహ్నంగా భావించండి.స్పష్టమైన డిమాండ్: మార్పు కావాలని కోరుకున్నప్పుడు కేవలం ఫిర్యాదు చేయకుండా, ఏం కావాలో స్పష్టంగా చెప్పడం నేర్చుకోండి.సామూహిక శక్తి: సమస్య అందరిదీ అయినప్పుడు కలిసికట్టుగా గళమెత్తండి. ఫలితాన్ని అంచనా వేయండి: మీ పోరాటం మిమ్మల్ని ఎంతవరకు మెరుగుపరిచిందో గమనిస్తూ ఉండండి.ఫ్రెడరిక్ డగ్లస్ చెప్పినట్లు, నిశ్శబ్దం అనేది అన్యాయాన్ని కొనసాగించడానికి ఇచ్చే అనుమతి వంటిది. సంఘర్షణ వల్ల కలిగే కష్టం కంటే, మార్పు లేకుండా అక్కడే ఆగిపోవడం వల్ల కలిగే నష్టం చాలా ఎక్కువ.

## భర్త మృతితో దిక్కుతోచని స్థితిలో ఉన్న మహిళకు అండగా నిలిచిన చిన్ననాటి స్నేహితులు

### ఆర్థిక సహాయం, రెండు నెలల నిత్యావసరాలు అందజేసి మానవత్వం చాటిన స్నేహబంధం



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక రాజీవ్ నగర్ కాలనీ (గాంధీనగర్)లో నివాసం ఉంటున్న దారా సునీత కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు అండగా నిలిచి మానవత్వాన్ని చాటారు.దారా సునీత భర్త దారా రాజు ఈ నెల 2వ తేదీన గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఇద్దరు ఆడపిల్లలతో సునీత తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ దిక్కుతోచని పరిస్థితిలో ఉండగా, ఈ విషయం తెలుసుకున్న ఆమె చిన్ననాటి స్నేహితులు వెంటనే స్పందించారు.సారపాక ప్రభుత్వ పాఠశాలలో 1997 సంవత్సరంలో 7వ తరగతి కలిసి చదివిన స్నేహితులు ఒక్కటై సునీత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. అంతేకాకుండా కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రెండు నెలలకు సరిపడ నిత్యావసర సరుకులను కూడా అందజేశారు.కష్టకాలంలో తోటి స్నేహితురాలికి అండగా నిలవడం ద్వారా చిన్ననాటి అనుబంధం ఎంత గొప్పదో మరోసారి చాటిచెప్పారని స్థానికులు అభినందించారు. స్నేహితుల సహాయంతో సునీత కుటుంబానికి కొంత ఊరట లభించిందని కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ సేవా కార్యక్రమంలో రఫీ, నర్సింహారావు, కుమార్, మోహన్, హరింద్రచారి, ప్రవీణ్, సిద్ది రాజు తదితర స్నేహితులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి...

### సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి ముద్దా డిమాండ్..



**మణుగూరు, మహా :** పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.3 పెంచిన కేంద్ర ప్రభుత్వం, తాజాగా మరో రూపాయి వరకు ధరలు పెంచి సామాన్యులపై భారం మోపుతోందన్నారు. ఇంధన ధరల పెరుగుదలతో సరుకుల రవాణా వ్యయాలు అధికమై, నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.కావున పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ధరల పెంపును నిరసిస్తూ ఈ నెల 29, 30 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్‌రెడ్డి, డివిజన్ నాయకులు చెట్టిపెల్లి నాగేశ్వరరావు, పి. సంజీవరెడ్డి, ఎన్. రాజశేఖర్‌రెడ్డి, సమ్మయ్య, బుచ్చిరాములు, మల్సూరు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసౌకర్యార్థం సారపాకలో పలు సీసీ రోడ్లకు శ్రీకారం

### రూ .85 లక్షల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలంలోని సారపాక గ్రామపంచాయతీ పరిధిలో ప్రజల రవాణా, ప్రయాణ సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో చేపట్టిన పలు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శ్రీకారం చుట్టారు.తెలంగాణ ప్రజా ప్రభుత్వం సహకారంతో గ్రామాభివృద్దే ధ్యేయంగా చేపడుతున్న ఈ పనులు సారపాక, గాంధీనగర్, భాస్కర్ నగర్ ప్రాంతాలలో అమలు కానున్నాయి. స్థానిక ప్రజల అవసరాలు, గ్రామాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని సుమారు రూ.85 లక్షల అంచనా వ్యయంతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు.గ్రామ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి కాలనీ, ప్రతి వీధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో సంబంధిత మండల అధికారులు, సారపాక గ్రామపంచాయతీ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించాలి

- హౌసింగ్ సొసైటీ కి 23 ఎకరాల స్థలాన్ని అప్పగించాలి
- జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న జర్నలిస్టులకు తీరని అన్యాయం
- రాష్ట్ర క్యాబినెట్ లో ఇళ్లస్థలాలపై వెంటనే ఆమోదం తెలపాలి
- టి యు డబ్ల్యూ జె టిజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ
- ఖమ్మంలో జర్నలిస్టుల నిరసన ప్రదర్శన




**ఖమ్మం,మహా.** జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణి జర్నలిస్టు వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ఉన్నాయని, గత ప్రభుత్వం క్యాబినెట్ లో 23.2 ఎకరాల భూమిని ఖమ్మం జర్నలిస్టులకు కేటాయిస్తూ జీవో జారీ చేశారని , కానీ వాటిని అమలు చేయడంలో నేటి పాలక పక్షాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టీజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖమ్మం ప్రెస్ క్లబ్ నుంచి మయూరి సెంటర్ మీదుగా అమరవీరుల స్తూపం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద జర్నలిస్టులు నివాళులు అర్పించిన అనంతరం జరిగిన సభలో టి యు డబ్ల్యూ జె (టి జె ఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ... జర్నలిస్టుల సమస్యలు పరిశీలిస్తామని అనేక వాగ్దానాలు చేసిన నేటి పాలకులు అధికారంలోకి వచ్చాక జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ద్వంద వైఖరి అవలంబించడం బాధాకరం అన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా జర్నలిస్టులకు కేటాయించిన 23.2 ఎకరాల భూమిని హౌసింగ్ సొసైటీ ద్వారా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో కాలయాపన చేయడం మంచిది కాదన్నారు. ఈనెల 21న జరిగే క్యాబినెట్ సమావేశంలో సరైన నిర్ణయం తీసుకొని జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు వచ్చే విధంగా ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అనేక చీకటి జీవోలు జారీ చేస్తూ కోత విధించే విధంగా వ్యవహరించడం సరైంది కాదు అన్నారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు రామిశెట్టి విజేత, జిల్లా ఉపాధ్యక్షులు మంజుల ఉపేందర్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కి గోపి, నగర ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా వీడియో గ్రాఫర్స్ అధ్యక్షులు నాగరాజు,ఎలక్ట్రానిక్ మీడియా నగర కార్యదర్శి కె .అశోక్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు పానకాలరావు, ముత్యాల కోటేశ్వరరావు, రేపాక యాదగిరి, పులి శ్రీను ,మూల జీవన్ రెడ్డి, నాయకులు మురళి, నరేష్, నల్లమోతు శ్రీను, ఉల్లోజు రమేష్, జక్కుల వెంకటరమణ, హుస్సేన్, ఈసంపల్లి వెంకటేశ్వర్లు, అప్పారావు, శ్రీధర్, ఎన్ రమేష్, సాయి, రామకృష్ణ, తోట గణేష్, పెంటి వెంకటేశ్వర్లు, ఉత్కంఠం శ్రీనివాస్, మహిళ జర్నలిస్ట్ రోజా, రవీందర్ ,నాయుడు, వేణుగోపాల్, శేఖర్, మధు, సుధాకర్, బాబు, లింగయ్య, సతీష్ ,మహేష్, నరసింహారావు, నాగేశ్వరరావు, గుండు శ్రీను, వెంకటేష్ ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ దరఖాస్తు ను క్షేత్ర స్థాయిలో నివేదిక విచారణ పూర్తి చేయాలి

### ప్రజా దర్బార్ లో దరఖాస్తుల సమీక్షలో కలెక్టర్ దివాకర్



**నేలకొండపల్లి, మహా:** ప్రజా దర్బార్ లో వచ్చిన దరఖాస్తు లను క్షేత్ర స్థాయిలో నివేదిక విచారణ ను వారం లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర్ ఆదేశించారు. మండల తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ప్రజా దర్బార్ దరఖాస్తుల పై సమీక్ష సమావేశం ను నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించారు. ప్రజా దర్బార్ దరఖాస్తు లు ఏ స్థాయిలో ఉన్నాయి...ఏ విధంగా పూర్తి చేస్తున్నారు. అనే విషయాల పై కలెక్టర్ తెవిన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా దరఖాస్తుల పరిశీలనకు తీసుకుంటున్న చర్యలు ఏమిటీ అని తెలుసుకున్నారు. పరిష్కారం కు తీసుకోవాలిన పలు జాగ్రత్తలను వివరించారు. తగిన సూచనలు, సలహాలు అందించారు. మూడు క్లస్టర్స్ లో వచ్చిన ప్రజా దర్బార్ లో వచ్చిన 686 దరఖాస్తుల ను దరఖాస్తుల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ప్రజా దర్బార్ దరఖాస్తులన్నింటినీ క్షేత్ర స్థాయిలో పరిలలించి వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఏ ఒక్క దరఖాస్తు కూడ రిజెక్ట్ చేయకుండా అన్ని దరఖాస్తు లను పరిష్కరించాలని ఆదేశించారు. వారం రోజులలో దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన “ పలు సమస్య పై వినతి ప్రతాలను అందించారు. వాటిని పరిష్కరించాలని తహా శిల్దార్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ శ్రీనివాస్, తహసీల్దార్ రాంప్రసాద్, ఆర్ .ఐ .లు ఆలస్యం మధుసూదన్ రావు, ఆల్లం రవికుమార్ లు ఉన్నారు

## బొగ్గు రవాణాలో నాణ్యత, భద్రతకు ప్రాధాన్యం..

- సమిష్టి కృషితో 65 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం
- ఏరియాలో కేసీహెచ్‌పీ, పీకేఓసీ-4లో మల్టీ డిపార్ట్మెంట్ కార్యక్రమంలో
- జీఎం దుర్గం రామచందర్



**మణుగూరు, మహా :** సింగరేణి మణుగూరు ఏరియా వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలలో భాగంగా మంగళవారం మల్టీ డిపార్ట్మెంట్ బృందం మణుగూరు ఏరియాలోని కేసీహెచ్‌పీ, పీకేఓసీ4లను సందర్శించి ఉద్యోగులు, అధికారులకు మన సంస్థ - మన గని - మన బాధ్యత అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మల్టీ డిపార్ట్మెంట్ బృందం కన్వీనర్, జీఎం దుర్గం రామచందర్ మాట్లాడుతూ.. బొగ్గు రవాణాలో కేసీహెచ్‌పీ కీలక పాత్ర పోషిస్తోందని, బొగ్గు సరఫరాలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా యంత్రాల పని తీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. బ్రేక్‌డౌన్ జరిగే అవకాశాలను ముందుగానే గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైన అదనపు పరికరాలను ముందస్తుగా సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించేందుకు సెల్ పిక్కింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, బొగ్గు లోడింగ్ ప్రక్రియలో పాల్గొనే కార్మికులు, సూపర్వైజర్లు పూర్తి స్థాయి రక్షణ పరికరాలు ధరించి భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. దుమ్ము, ధూళి, వాయు కాలుష్య ప్రభావం తగ్గించేందుకు కేసీహెచ్‌పీ ప్రాంగణంలో నిరంతరం వాటర్ స్ప్రేయింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. వాయు కాలుష్య నియంత్రణలో వృక్షాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంటూ పని ప్రదేశాలు, పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కేసీహెచ్‌పీ నిర్దేశించిన బొగ్గు రవాణా లక్ష్యాలను అధికారులు, ఉద్యోగులు సమిష్టిగా కృషి చేసి సాధించాలని అన్నారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపడుతున్న కేసీహెచ్‌పీ అధికారులను, ఉద్యోగులను అభినందించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మణుగూరు ఏరియా కేసీహెచ్‌పీ వార్షిక బొగ్గు రవాణా లక్ష్యాలను వివరించారు. రెండో షిఫ్ట్‌లో పీకేఓసీ4లో ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో 202627 సంవత్సరానికి మణుగూరు ఏరియా వార్షిక ఉత్పత్తి లక్ష్యమైన 96.26 లక్షల టన్నులు, సింగరేణి వ్యాప్తంగా 65 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాలను సమిష్టి కృషితో సాధించాలని పిలుపునిచ్చారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ భద్రతతో ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కంపెనీ ఎదుర్కొంటున్న సవాళ్లు, ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణా, ఓబీ వెలికితీత తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సింగరేణి వ్యాప్తంగా, మణుగూరు ఏరియాలో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం బి. శ్రీనివాస చారి, ఏరియా ఇంజినీర్ ఆర్ శ్రీనివాస్, పీఓ పీకేఓసీ ఎం. శ్రీరమేశ్, ఏజీఎం ఐఈడీ సిహెచ్. రాంబాబు, ఏజీఎం పర్సనల్ రమేష్, డీజీఎం కేసీహెచ్‌పీ వి. మధన్ నాయక్, ఆర్.ఎస్. గౌడే, డీజీఎం (క్వాలిటీ), ఓసీ4 మేనేజర్ రమణారెడ్డి, ఫైనాన్స్ మేనేజర్ పి. రమేష్ పాల్గొన్నారు. అలాగే గుర్తింపు సంఘం (AITUC) బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్, ప్రాతినిధ్య సంఘం వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణంరాజు, ఓసీ2 సంక్షేమ అధికారి చంద్రకిరణ్‌తో పాటు కేసీహెచ్‌పీ, ఓసీ4 ఉద్యోగులు, అధికారులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటరు సందేహాలకు కోసం హెల్ప్ డెస్క్



**నేలకొండపల్లి, మహా:** ఓటరు సందేహాలు పరిష్కరించే కొరకు ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు నేలకొండపల్లి తాసిల్దార్ రాంప్రసాద్ తెలిపారు. స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో మంగళవారం హెల్ప్ డెస్క్ న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు సందేహాలు నివృత్తి కోసం ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నేలకొండపల్లి మండలం తహసిల్దార్ కార్యాలయం లో ముగ్గురు సిబ్బందిని నియమిస్తూ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ లో ఇంచార్జ్ సింగ్ జూనియర్ సహాయకులు, 9866564712, హెల్ప్ డెస్క్ , టి వెంకట రాములు రికార్డ్ అసిస్టెంట్, సెల్ నెంబర్. 9618684729, హెల్ప్ డెస్క్ వీరయ్య రికార్డ్ అసిస్టెంట్ సెల్ నెంబర్. 9912259978 పైవారిని నియమిస్తూ తెలపనైనది మరియు మండలంలోని ఓటర్లకు సందేహాలు కలిగితే ఇక్కడ ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్ నెంబర్ల ద్వారా మీ యొక్క సందేహాలను నివృత్తి చేసుకోవాలని తెలిపినారు. ఈ విలేకర్ల సమావేశంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆలస్యం మధుసూదన్ రావు, అల్లం రవికుమార్ ఉన్నారు.

## ఉద్యమకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**నేలకొండపల్లి, మహా:** ఉద్యమకారులు సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ జిల్లా నాయకులు మాదా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలం కొత్త కొత్త గ్రామంలో తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో జిల్లా నాయకులు మాదాసు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం తెలంగాణ ఉద్యమకారుల కొరకు కమిటీ ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యమకారుల కమిటీ చైర్మన్ కే కేశవలకు ఎమ్మెల్సీలు కోదండరాం , అద్దంకి దయాకర్ లకు రుణపడి ఉంటామని అన్నారు. ఉద్యమకారులను గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వారా న్యాయం జరుగుతుందని శ్రీనివాసరావు తెలిపారు. ఉద్యమంలో అనేక త్యాగాలతో ఉద్యమం జరిగిన సందర్భంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డదన్నారు. ఉద్యమకారులను గుర్తించి 250 గజాల స్థలం, 25 వేల రూపాయలు పెన్షన్, హెల్త్ కార్డు బస్ పాసు ఉద్యమకారుల గుర్తింపు కార్డు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లను కోరారు. ఆరోజు ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడికి ఈ అవకాశం కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని సానుకూలంగా ఉద్యమకారుల పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేస్తారని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు మందటి వెంకటేశ్వరరావు, తీగ రాములు గూగు లోతు ఆంజనేయులు సురగాని యాకయ్య మేకల వెంకటేశ్వర్లు కర్లపూడి కోటయ్య తదితరులు పాల్గొన్నారు

## సుందరయ్య ఆశయాల సాధనకు కృషి చేయాలి..



- పేదలు, రైతులు, కార్మికుల కోసం పోరాడిన మహానేత..
- సీపీఎం రాష్ట్ర నేత అన్నవరపు కనకయ్య

**మణుగూరు, మహా :** ప్రజా నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాల సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మణుగూరులోని సీపీఎం శ్రామిక భవన్ కార్యాలయంలో సుందరయ్యకు ఘన నివాళులర్పించారు. కార్యక్రమానికి సత్రపల్లి సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ.. సుందరయ్య జీవితాంతం పేద ప్రజలు, రైతులు, కార్మికులు, నిరుపేదల హక్కుల కోసం అహర్నిశలు పోరాడిన మహానేత అని కొనియాడారు. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో ఆయన పోషించిన పాత్ర చారిత్రాత్మకమని పేర్కొన్నారు. సామాజిక సమానత్వం, భూసంస్కరణలు, కార్మిక హక్కుల సాధన కోసం ఆయన చేసిన త్యాగాలు నేటి తరానికి ఆదర్శమని అన్నారు. నేటి యువత సుందరయ్య సిద్ధాంతాలు, నిజాయితీ, నిరాడంబర జీవనశైలిని ఆదర్శంగా తీసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజల మధ్య ఉండి వారి సమస్యల కోసం పోరాడటమే నిజమైన కమ్యూనిస్టు కార్యకర్త లక్షణమని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, జిల్లా కమిటీ సభ్యుడు గద్దల శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు నెల్లూరు నాగేశ్వరరావు, సీఐటీయూ మండల కన్వీనర్ కొడిశాల రాములు, మండల కార్యదర్శివర్గ సభ్యులు దామల్ల వెంకన్న, ములకల ఉత్తం, నైనారపు నాగేశ్వరరావు, ఎస్. వెంకట్రావు, రమేష్, రెడ్డి అమాలి యూనియన్ మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ప్రతిజ్ఞ చేశారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గెంపూడి కృష్ణారెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలానికి చెందిన భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దుగ్గెంపూడి కృష్ణారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృష్ణారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, వైద్యుల సూచనలను పాటిస్తూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైతే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తగిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన వైద్య సహాయం అందించాలని సూచించారు.పార్టీ కోసం కృష్ణారెడ్డి చేస్తున్న సేవలను ఎమ్మెల్యే ఈ సందర్భంగా అభినందించారు. .

## పాస్టర్ అభినయ్ దర్శన్ పై దాడి అమానుషం

- క్రైస్తవులకు రక్షణ కల్పించాలి
- పాస్టర్స్ పెల్లోషిప్ డిమాండ్



**దమ్మపేట ,మహా :** ఆంధ్రప్రదేశ్ లోని పాడేరు ప్రాంతంలో క్రైస్తవులపై చేస్తున్న దాడులకు నిరసనగా మండల పరిదిలోని పాస్టర్స్ పెల్లోషిప్ ఆద్వర్యంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గత రెండురోజుల క్రితం పాస్టర్ అభినయ్ దర్శన్ పై చేసిన అమానుష దాడిపై తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాస్టర్స్ మాట్లాడుతూ క్రైస్తవుల ఐక్యతను చాటుతూ, పాస్టర్ల మీద, క్రైస్తవుల మీద జరుగుతున్న మత పరమైన దాడుల విషయమై ఇటీవల పాడేరు నియోజకవర్గంలో అభినయ దర్శన్ పాస్టర్ మీద కొంతమంది మత చాంధస్సువాదులు కళ్లల్లో కారం చల్లి,కత్తులతో దాడి చేసి, చంపాలనే దుశ్చర్యను బహుజన దమ్మపేట మండల పాస్టర్స్ ఫెలోషిప్ తరుపున తీవ్రంగా ఖండించడం జరిగింది.ఈ సమావేశంలో బండారు జాన్, మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో ఇలాంటి మతపరమైన దాడులు జరగడం సిగ్గుచేటని, ఇలాంటి దాడులను తీవ్రంగా ఖండించడం జరిగింది. రమేష్ జాషువా మాట్లాడుతూ ఇలాంటి మతపరమైన దాడులకు, విద్వేషాలకు కారణమైన వారినీ ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి చర్యలపై దృష్టి సారించి, క్రైస్తవులకు, పాస్టర్లకు, క్రైస్తవ సమాజానికి అండగా నిలబడాలని కోరడం జరిగింది. క్రైస్తవులు, పాస్టర్లు శాంతి, సమాధానం కోసం, సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేసే మనస్తత్వం కలిగిన మాపై ఇలాంటి దాడులు సబబు కాదని హితవు పలికారు. ఈలాంటి దుశ్చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు,అధికారులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు క్రైస్తవులకు అండగా నిలబడాలని కోరడం జరిగింది.

## పాలిటెక్నిక్ కళాశాలలో సింగరేణి కోల్ నీర్ ఆర్‌వో ప్లాంట్ ..

### ప్రారంభించిన ఏరియా జీఎం దుర్గం రామచందర్



**మణుగూరు, మహా :** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో సీఈఆర్ (కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో చేపట్టిన ప్రాంతీయ అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలో 250 లీటర్ల సామర్థ్యం గల సింగరేణి కోల్ నీర్ ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను మంగళవారం ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణుగూరు ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ విస్తరణలో భాగంగా పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం రూ.5.5 లక్షల వ్యయంతో ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మణుగూరు పరిసర ప్రాంతాలకు మొత్తం 10 ఆర్‌వో ప్లాంట్లను సింగరేణి యాజమాన్యం మంజూరు చేసిందన్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని, కళాశాల విద్యార్థులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఎస్‌వో టు జీఎం బి. శ్రీనివాస చారి, ఏజీఎం(పర్సనల్) సలగల రమేశ్, పీవో-ఎంఎన్ జీఓసీ శ్రీనివాస్, డీజీఎం(సివిల్) జి. శివప్రసాద్, డీజీఎం(సర్వే) ఎల్. దయాకర్, మణుగూరు ఓసీ మేనేజర్ బైరెడ్డి వెంకటేశ్వర్లు, సేఫ్టీ అధికారి ఆర్. భాస్కర్ రావు, ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్, అడిషనల్ మేనేజర్లు నవీన్, కిషన్ రామ్, డిప్యూటీ ఎస్ఈ(ఈఅండ్ఎం) శోభన్ బాబు, డిప్యూటీ ఎస్ఈ (సివిల్) ప్రవీణ్, జీఎంఆర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రమణమూర్తి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## రైల్వే డబ్లింగ్ ఇళ్ల స్థలాలకు గజాల్లో పరిహారం చెల్లించాలి

- సింగరేణి సర్పంచ్ కు నిర్వాసితుల వినతి
- ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానన్న సర్పంచ్



**కారేపల్లి, మహా:** రైల్వే డబుల్ లైన్ పనుల కోసం చేపట్టిన భూసేకరణ లో ఇళ్ల స్థలాలు కోల్పోతున్న నిర్వాసితుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ కారేపల్లి రైల్వే లైన్ నిర్వాసితులకు మంగళవారం కారేపల్లి సర్పంచ్ మేదరి టోనీ కి వినతి పత్రం సమర్పించారు. గతంలో అధికారులు ప్రకటించిన విధంగానే ఇళ్ల స్థలాలు కోల్పుతున్న వారందరికి గజాల చొప్పున చెల్లించాలని కోరారు.ఈ సందర్భంగా భూ నిర్వాసితులు మాట్లాడుతూ...సింగరేణి గ్రామ పరిధిలో రైల్వే డబ్లింగ్ లో భాగంగా ఇళ్ల స్థలాలు కోల్పుతున్నామనీ,ఆ ఇళ్ల స్థలాలకు గజానికి రూ.6300 చొప్పున పరిహారం చెల్లిస్తామని గతంలో జరిగిన సమావేశాల్లో ప్రకటించారని తెలిపారు. అవార్డు ప్రకటించే ముందు ఇల్లు కోల్పోయిన వారికి మాత్రమే ఇళ్ల స్థలాలతో కలిపి గజాల చొప్పున కట్టిస్తామని అధికారులు పేర్కొంటున్నారని చెప్పారు.ఈ యొక్క భూ సేకరణలో కొందరి ఇల్లు మరికొందరి ఇల్లు మినహా ఆ ఇళ్లకు సంబంధించిన స్థలాలు మాత్రమే సేకరించారనీ,గత 70 సంవత్సరాలుగా ఇళ్ల స్థలాలు గానే ఉన్నాయనీ,వాటికి గజాల చొప్పున చెల్లిస్తేనే మాకు న్యాయం జరుగుతుందనీ కోరారు. ఏడు దశాబ్దాలు గా గ్రామం పరిధిలో ఇళ్ల మధ్య ఉన్న స్థలాలకు కన్వర్షన్ లెటర్లు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను అడగటం ఏంటని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం జరిగేలా చూడాలని సర్పంచ్ ను కోరారు. దీనిపై స్పందించిన సర్పంచ్ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం చేకూరేలా చేస్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో సాదిక్ అలీ, తుమ్మలపల్లి కోటేశ్వరరావు,పరిటాల రవి,పాషా తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలని ఆకస్మిక తనిఖీ చేసిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి





**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్, పోచంపల్లి మండలాలలో మంగళవారం నాడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిశీలించారు ఈ సందర్భంగా పిలాయిపల్లి గ్రామంలోని ఇంద్రాకిలాద్రి రైస్ మిల్లును ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జూలూరు ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు బీబీనగర్ మండలం రుద్రవెల్లి ప్యాక్స్ (PACS) ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం తరలింపు పరిస్థితులను సంబంధిత అధికారులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కేంద్రాల వద్ద ఉన్న రైతులతో ఎమ్మెల్యే మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రైస్ మిల్లర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు పాల్పడవద్దని హెచ్చరించారు.అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను వినియోగించి ధాన్యం నిల్వ ప్రక్రియ చేపట్టాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి రైస్ మిల్లు, ఐకేపీ (IKP), ప్యాక్స్ (PACS) ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.హమాలీలు, లారీల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుని, ధాన్యం తరలింపు ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. రైతులకు ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.అనంతరం జూలూరు రైతు వేదికలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాత పార్టీ అని, గత రెండేళ్లుగా ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమయానికి ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తోందని తెలిపారు.అక్కడక్కడ ఎదురవుతున్న సమస్యలను అన్ని శాఖల సమన్వయంతో పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగానే ధాన్యం ఎగుమతి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. భారతీయ జనతా పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

## మొక్కజొన్న బస్తాల దిగుమతి వేగవంతం చేయాలి

### కారేపల్లి జిన్నింగ్ మిల్లులో స్థానిక రైతులకు అవకాశం ఇవ్వాలి - రైతు సంఘం



**కారేపల్లి, మహా:** ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన మొక్కజొన్న బస్తాల దిగుమతిలో తీవ్ర జాప్యం జరుగుతుందని దానిని నివారించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ లు డిమాండ్ చేశారు. మంగళవారం కారేపల్లిలోని జిన్నింగ్ మిల్లులో మొక్కజొన్న బస్తాల స్టాక్ పాయింట్ ను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు తోపాటు దిగుమతి పాయింట్ లో ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. రైతులు, వాహనాల డ్రైవర్లతో రైతు సంఘం నేతలు మాట్లాడారు. సోసైటీ అధికారులతో చర్చించారు. రైతుల ఇబ్బందులు కలగకుండా చూడాలని స్థానిక అధికారులను కోరారు. ఈసందర్బంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ కారేపల్లి జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన మొక్కజొన్న బస్తాల స్టాక్ పాయింట్ లో స్థానిక రైతుల ట్రాక్టర్లు, లారీలు కి కూడా అవకాశం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ శాఖల అధికారుల మధ్య సమన్వయం, అవగాహన లేకపోవడంతో మొక్కజొన్న బస్తాలు దిగుమతి కేంద్రాల్లో రైతులు, లారీ, ట్రాక్టర్లు డ్రైవర్లు రోజుల తరబడి తీవ్ర ఇక్కట్లు గురవుతున్నారన్నారు. దిగుమతి పాయింట్ వద్ద కనీసం మంచినీరు కూడా అందుబాటులో లేదన్నారు. ఏక కాలంలో ఎక్కువ పాయింట్ల లో దిగుమతిలు చేయాలని సూచించారు. ఒక్క పాయింట్ పూర్తి గా నిండిన తర్వాత మరో పాయింట్ దిగుమతి కి అవకాశం ఇవ్వడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మొక్కన్న కొనుగోళ్లపై స్థానిక ఎమ్మెల్యే ప్రతి రోజు సమీక్షించాలని కోరారు. ఈ సందర్భంగా జిన్నింగ్ మిల్లుకు వచ్చిన మార్క్‌ఫెడ్ డీయం కు సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం కారేపల్లి మండల అధ్యక్షులు ముండ్ల ఏకాంబరం, కార్యదర్శి వజ్జా రామారావు, సోసైటీ డైరక్టర్ అడ్డగోడ ఐలయ్య, రైతులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న స్టాక్ పాయింట్లను తనిఖీ చేసిన డీఎం



**కారేపల్లి, మహా:** కారేపల్లి మండలంలోని మొక్కజొన్న స్టాక్ పాయింట్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్కెటింగ్ శాఖ డీఎం జే.నరేందర్ మంగళవారం తనిఖీ చేశారు. అప్పాయిగూడెం గోదాం, జిన్నింగ్ మిల్ స్టాక్ పాయింట్లను డీఎం పరిశీలించారు. సోమవారం రాత్రి కారేపల్లిలో రైతులు అందోళనకు దిగటంతో విషయం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ రైతు సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. కారేపల్లి మండల రైతుల మొక్కజొన్నను స్థానికంగానే దిగుమతి చేయటానికి అవకాశాలు పరిశీలించాలని కలెక్టర్ ను ఎమ్మెల్యే కోరారు. కలెక్టర్ ఆదేశాలతో మార్కెటింగ్ డీఎం గోదాంలను పరిశీలించారు. ఈసందర్బంగా సోసైటీ డైరక్టర్ అడ్డగోడ ఐలయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు బొంతు రాంబాబు, దుగ్గి కృష్ణ, లు జిన్నింగ్ మిల్లు స్టాక్ పాయింట్‌లో కారేపల్లి మండల రైతులకు అవకాశం కల్పించాలని డీఎంను కోరారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌తో ఫోన్‌లో డీఎంతో మాట్లాడి స్థానిక రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. డీఎం వెంట సోసైటీ కార్యదర్శి బొల్లు హనుమంతరావు, మార్కెటింగ్ శాఖ సిబ్బంది ఉన్నారు.

## ఉపాధీ దూరం చేసే ఎత్తుగడలపై పోరాడుదాం వ్యకాస



**కారేపల్లి, మహా :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలకు ఉపాధి దూరం చసే ఎత్తుగడలు వేస్తుందని దానిపై ఐక్యంగా పోరాడుదామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దాసరి మల్లయ్య, బానోత్ బన్సీలాల్ అన్నారు. మంగళవారం కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో నిర్వహిస్తున్న ఉపాధీ హామీ పనుల ను వ్యకాస బృందం పరిశీలించింది. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్బంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పేదలపై వివక్షత చూపుతుందన్నారు. ఉపాధీ హామీ కి నిధులు కేటాయింపులో కోత, ఉపాధీ కి 60 శాతం నిధులు మాత్రమే కేంద్రం ఇస్తుందని, మిగతా 40 శాతం రాష్ట్రం ఇవ్వాలని షరతు పెట్టటం ఉపాదీ హక్కును లాక్కోవటమేన్నారు. పని ప్రదేశంలో రెండు సార్లు పోటో పద్దతి రద్దు చేయాలని, ప్రతి ఒక్కరి 200రోజుల పని, కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో టెంట్ , మంచినీరు, మెడికల్ కిట్స్, పనిముట్లు అందించటంతో పాటు వేసవీ అలవెన్స్ చెల్లించాలన్నారు. ఉపాధీ హామీ సమస్యల పరిష్కారానికి ఈనెల 20వ తేదిన ఖమ్మం కలెక్టరేట్ ముందు జరిగే ధర్నా జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో తేజావత్ చందర్, రమేష్, వెంకన్న, సరోజా తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల గణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి



**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**యాదాద్రి భువనగిరి, మహా:** జనగణన2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను, పారదర్శకంగా సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లాకలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు మంగళవారం చౌటుప్పల్ లో జరుగుతున్న ఇండ్ల గణన ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ఎన్యూమారేటర్లను ఇంటింటి సర్వే సక్రమంగా, పారదర్శకంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎన్యుమరేటర్ల దే అని తెలిపారు .నిర్దేశిత నిబంధనల ప్రకారం మొబైల్ యాప్ ద్వారా స్పష్టమైన, కచ్చితమైన వివరాలను సేకరించాలాన్నారు మొదటి దశలో మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ఇళ్ల గణన నిర్వహిస్తారని, ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించి, నమోదు చేయాలని ఆదేశించారు.అందరి వివరా లు గోప్యంగా ఉంచాలని స్పష్టం చేశారు. ప్రజలు కూడా ఎన్యూమరేటర్లు అడిగే ప్రశ్నలకు ఎలాంటి దాపరికం లేకుండా ఖచ్చితమైన సమాధానాలు చెప్పాలని.... దీనివల్ల ప్రభుత్వానికి సరైన లెక్కలు అందుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**యాదాద్రి భువనగిరి, మహా:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.మంగళవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగెడపల్లి లో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, గర్భిణీ స్త్రీలకు అందజేస్తున్న ఆరోగ్య పరీక్షలు, నిర్మాణంలో ఉన్న నూతన భవనం పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఓపీకి ఎంతమంది రోగులు వస్తున్నారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సరైన చికిత్స అందేలా చూడాలని సూచించారు.ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ఎన్‌సీడీ క్యాంపును కలెక్టర్ పరిశీలించారు. క్యాంపుకు వచ్చిన గర్భిణీ స్త్రీలకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలను పరిశీలించి, వారికి అందిస్తున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. గర్భిణీల రక్తపోటు, షుగర్ తదితర పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, అవసరమైన మందులు సమయానికి అందించాలని వైద్య అధికారులకు ఆదేశించారు.అనంతరం గర్భిణీ స్త్రీల ఆరోగ్య రికార్డులను పరిశీలించి, వారు ప్రతి నెలా రెగ్యులర్‌గా చెకప్‌కు వస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అన్ని రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయా, అవసరమైన మందులు సరిపడా నిల్వలో ఉన్నాయా అనే విషయాలపై ఆరా తీశారు. గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, హైరిస్క్ కేసులను ముందుగానే గుర్తించి తగిన వైద్యం అందించాలని సూచించారు. పి హెచ్ సి పరిధిలో ప్రతి నెల ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయనీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు మరింత నమ్మకం కలిగే విధంగా సేవలు అందించాలని పేర్కొన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న నూతన పి హెచ్ సి భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం ఐకెపి ధాన్యం కొనుగోలు సెంటర్ ను కలెక్టర్ పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ఎంత మేరకు ధాన్యం నిల్వ ఉందని, ఎంత మేర కొనుగోలు చేశారని ఆరా తీశారు. ధాన్యం కొలుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి జిల్లా వైద్యాధికారి మనోహర్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటి వివరాలు నమోదు చేయాలి

**అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**



**ఆలేరు, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న జనగణన కార్యక్రమాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పరిశీలించారు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి వివరాలను నమోదు చేయాలని నమోదులో ప్రతి ప్రశ్నకు సమాధానని ఇంటి వారి నుండి ఎన్యుమరేటర్లు సేకరించాలని ఎటువంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని అన్నారు పూర్తి స్థాయిలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున వీలైనంతవరకు ఉదయం వేళలోని విధులు నిర్వహించాలని ఎన్యూమరేట్ లకు సూచించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ సెన్సెస్ చార్జ్ ఆఫీసర్& కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి , మాస్టర్ ట్రైనర్ దూడల వెంకటేష్ , సూపర్వైజర్ పోరెడ్డి రంగయ్య , ఎన్యూమరేట్ లు సుదర్శన్ , శ్రీనివాస్, మున్సిపల్ వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


## ఆర్థిక సహాయం అందజేసిన వాకిటి అనంతరెడ్డి



**వలిగొండ, మహా :** వలిగొండ మండలంలోని అరూర్ గ్రామానికి చెందిన ఐలపాక నరసమ్మ మృతి చెందడంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి మంగళవారం ఆ కుటుంబాన్ని పరామర్శించి మృతి చెందిన ఐలపాక నరసమ్మ కుమారుడికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు నరసింహ దామెర అంజయ్య బుర్ర శ్రీశైలం వేముల అనిల్ కుమార్ బోగారం ధర్మయ్య పోలేపాక నరసింహ బుర్ర శివ పుట్టల కృష్ణ నల్లరాజు చాట నరసింహ బొలుగుల రాజు చాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## పేద కుటుంబాలకు అండగా సీఎం రేవంత్ రెడ్డి

### సీఎం రిలీఫ్ ఫండ్స్ చెక్కులు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**యాదాద్రి భువనగిరి, మహా:** తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలనకు కొత్త అర్థం తీసుకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి సంక్షేమ పథకాన్ని పారదర్శకంగా ప్రజలకు నేరుగా అందిస్తోందని ప్రభుత్వ విప్ పాలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు మంగళవారం నాడు యాదగిరిగుట్ట లోని తన నివాసంలో ఎనిమిది మండలాల లబ్ధిదారులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తులు, పైరవీలు, కమిషన్లకు తావులేకుండా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సహాయం నేరుగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు పెన్షన్, రేషన్ కార్డు, సీఎం రిలీఫ్ ఫండ్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల కోసం ఎవరైనా డబ్బులు అడిగినా, కిరాయిల పేరుతో ఇబ్బంది పెట్టినా వెంటనే అధికారులకు లేదా ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. "ఇది ప్రజల ప్రభుత్వం...మీ హక్కు మీ చేతికే చేర వేసే ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్నారు లక్షల రూపాయల సహాయం అందిస్తున్న ప్రభుత్వం, మధ్యలో ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదు.ప్రజల కష్టాలు తెలుసుకుని సేవ చేయడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తూ, పారదర్శక పాలనతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బీర్లు అయిలే అన్నారు.

## ఇటుక బట్టి కార్మికులతో జిల్లా న్యాయ సేవ సంస్థ కార్యదర్శి మాధవి లత ముఖాముఖి




**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు సూచనల మేరకు సంస్థ కార్యదర్శి వి.మాధవి లత తుర్కపల్లి మండలంలోని మల్కాపురంలోని ఇటుకల బట్టీని సందర్శించి కార్మికులు వారి కుటుంబ సభ్యులతో ముఖాముఖి నిర్వహించి వారి హక్కుల గురించి వివరించారు సంక్షేమ పథకాలు పొందటానికి తప్పనిసరిగా గుర్తింపు కార్డులు పొందాలని,తిరిగి ఒరిస్సాకు వెళ్లిన వారి పిల్లల భవిష్యత్తుకై అక్కడ చదువులను కొనసాగించాలని తెలిపి ఏదైనా న్యాయ సహాయం కోసం న్యాయ సేవ సంస్థలను ఆశ్రయించవచ్చని లేదా 15100 కు ఫోన్ చేసి న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. అదే మండలంలోని మాల్యాల గ్రామములోని ఐ. కె. పి కేంద్రములో నున్న రైతులు, వర్కర్స్ తో సమావేశమై వారికి అందే వేతనాలు, తూకంలలో జరిగే ఇబ్బందులు అడిగి తెలుసుకొని, రైతులు నఖిలి విత్తనాలపై అప్రమత్తమై ఉండాలని, భువనగిరి, రామన్నపేట రైతు వేదికలలో రైతులకు తగిన న్యాయ సహాయం, సలహాలకై న్యాయ సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపి ఏదైనా న్యాయ సహాయం కోసం 15100 ను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు. బొమ్మలరామారంలోని జి సి యం బాలల, బాలికల సంరక్షణ కేంద్రాలను సందర్శించి వసతులు తదితర అంశాలపై సమీక్షంచి నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు మరియు బాలికలు కుట్టిన వివిధ దుస్తులను వీక్షించి బాలికల ప్రతిభను ప్రశంసించారు . ఈ కార్యక్రమాలలో ఇటుక బట్టీ కార్మికులు, రైతులు, ఐ కె పి కేంద్రం ఇంచార్జీలు, సిసిఐ నిర్వాహకులు, బాలికలు, బాలలు పాల్గొన్నారు.

## రసాయన ఎరువులు తగ్గించండి..

### పెట్టుబడి ఖర్చులు ఆదా చేసుకోండి వ్యవసాయ శాస్త్రవేత్తల పిలుపు





**పాలకుర్తి:** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండల కేంద్రమైన పాలకుర్తి రైతు వేదికలో మంగళవారం 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా వ్యవసాయ శాఖ, కేవీకే రామగిరి ఖిల్లా సంయుక్తంగా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పచ్చి రొట్ట ఎరువుల వినియోగం మరియు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి, రైతులతో నేరుగా మాట్లాడారు.ఈ అవగాహన సదస్సులో కేవీకే రామగిరి ఖిల్లా శాస్త్రవేత్త డా. కిరణ్ పిల్లి మాట్లాడుతూ.సాగులో ఎరువుల సమతుల్య వాడకం ద్వారా పెట్టుబడి ఖర్చులను ఎలా తగ్గించుకోవచ్చో రైతులకు వివరించారు. భూమిలో పచ్చిరొట్ట పంటలను తొక్కివేయడం, జీవ ఎరువుల వినియోగాన్ని పెంచడం ద్వారా యూరియా వాడకాన్ని 25 శాతం వరకు తగ్గించవచ్చని ఆయన సూచించారు. జీవ ఎరువుల ప్రాధాన్యత, నానో ఎరువుల ప్రోత్సాహంపై రైతులకు అవగాహన కల్పించారు.అనంతరం వ్యవసాయ అధికారి AO బండి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ. రైతులు మోతాదుకు మించి రసాయన ఎరువులను వాడకూడదని హితవు పలికారు. రైతులు తమ పొలాల్లోని మట్టి నమూనాలను తీసుకువస్తే, కేవీకే రామగిరి ద్వారా ఉచితంగా భూసార పరీక్షలు చేసి నివేదికలు అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు AEO ఎం. యోజన, బి. శశిధర్, వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, కేవీకే శాస్త్రవేత్త డా. పి. కిరణ్ మరియు మండలంలోని అభ్యుదయ సాగు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బండి భగీరథ్ పోక్సో కేసులో మరో సిట్ ఏర్పాటు

### కస్టడీ కోరుతూ కోర్టులో పోలీసులు పిటిషన్

**హైదరాబాద్, మహా:** సంచలనం రేపిన బండి భగీరథ్‌కు సంబంధించిన పోక్సో కేసు వ్యవహారంలో హైకోర్టు న్యాయమూర్తిపై సోషల్ మీడియాలో జరిగిన దుష్ప్రచారంపై దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. జడ్జిపై అనుచిత, అసత్య పోస్టులు పెట్టిన వ్యవహారాన్ని ఛేదించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. ఈ కేసులో ఇప్పటికే ప్రధాన నిందితుడు రాయసం దామోదర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోగా, ఈ వివాదంతో సంబంధం ఉన్న మరికొందరిపై కూడా కేసులు నమోదయ్యాయి. ఈ కేసులన్నింటినీ సమగ్రంగా దర్యాప్తు చేసేందుకు జాయింట్ సీపీ శ్వేత నేతృత్వంలో ఈ సిట్ ను ఏర్పాటు చేస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ వివాదానికి గల కారణాలను పరిశీలిస్తే పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌కు గనుక ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే, ఆ హైకోర్టు జడ్జి భర్తకు బార్ కౌన్సిల్ చైర్మన్ పదవి ఇస్తారంటూ సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేశారు. న్యాయ వ్యవస్థ ప్రతిష్టను మసకబార్చేలా సాగిన ఈ ప్రచారంపై ఈ నెల 16న హైకోర్టు రిజిస్ట్రార్ చార్మినార్ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం చార్మినార్ పీఎస్ నుండి ఈ కేసును సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ చేశారు. తాజాగా ఈ వ్యవహారంలో ఉన్న కుట్ర కోణాలను, ఇతర నిందితుల పాత్రను పూర్తిగా బయటపెట్టేందుకు జాయింట్ సీపీ శ్వేత ఆధ్వర్యంలోని 'సిట్' రంగంలోకి దిగారు.

**భగీరథ్‌ను కస్టడీకి కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన పోలీసులు**

బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు దర్యాప్తును సిట్ బృందం ముమ్మరం చేసింది. ఈ కేసులో మరిన్ని కీలక వివరాలు, ఆధారాలను సేకరించేందుకు నిందితుడు బండి భగీరథ్‌ను తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హై ప్రొఫైల్ కేసు కావడం, ప్రతిపక్షాల నుంచి విమర్శలు రావడంతో ఈ కేసును రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ సీరియస్‌గా తీసుకుంది. ఈ కేసులో అన్ని కోణాలను లోతుగా విచారించాల్సి ఉన్నందున, భగీరథ్‌ను వారం రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలని దర్యాప్తు అధికారులు కోర్టును కోరారు. కోర్టు అనుమతి లభిస్తే నిందితుడిని కస్టడీలోకి తీసుకుని సుదీర్ఘంగా విచారించనున్నారు. బండి భగీరథ్ స్నేహితులను పేట్ బషీరాబాద్ పీఎస్‌లో పోలీసులు సోమవారం విచారించారు. ఆ ఘటన జరిగిన రోజు అసలేం జరిగింది, ఎంత మంది ఉన్నారు, ఎందుకు కలిశారు అనే విషయాలపై ఆరా తీశారు. విచారణలో భాగంగా పోలీసులు వారి స్టేట్మెంట్స్ రికార్డు చేశారు. నిందితుడు బండి భగీరథ్‌పై పోలీసులు మరింత కఠినమైన బీఎన్ఎస్ సెక్షన్‌ను చేర్చారు. ఒకరిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు అభియోగాలు ఉండటంతో పోలీసులు ఈ కొత్త సెక్షన్‌ను నమోదు చేశారు.

# పబ్లిక్ ప్లేసుల నుంచి వీధి కుక్కలను తరలించాల్సిందే...

- రాష్ట్రాలకు కీలక ఆదేశాలు జారీ చేసిన సుప్రీం కోర్టు
- పిచ్చి కుక్కలకు కారుణ్య మరణం
- అధికారులకు అనుమతి

**న్యూఢిల్లీ, మహా :** వీధి కుక్కల దాడులపై సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రైల్వే స్టేషన్ల వంటి రద్దీ ప్రదేశాల నుంచి కుక్కలను వెంటనే తొలగించాలని ఆదేశించింది. నిబంధనలు పాటించని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంగళవారం సంచలన తీర్పు ఇచ్చింది. గత ఏడాది నవంబర్‌లో ఇచ్చిన మార్గదర్శకాలను సడలించేందుకు నిరాకరించడమే కాకుండా, వాటిని యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

**ఇన్‌స్టిట్యూషనల్ ఏరియాల నుంచి కుక్కల బహిష్కరణ**

పాఠశాలలు, ఆస్పత్రులు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, రైల్వే స్టేషన్లు, బస్ డిపోల వంటి అత్యంత రద్దీ ఉండే ప్రదేశాల్లో వీధి కుక్కలు ఉండకూడదని ధర్మాసనం ఖరాఖండిగా చెప్పింది. సాధారణంగా కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేశాక, వాటిని ఎక్కడ పట్టారో మళ్లీ అదే చోట వదిలిపెడతారు. కానీ, ఇకపై ఈ కీలక ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఆవరణల నుంచి తీసుకెళ్లిన కుక్కలను మళ్లీ అక్కడ వదలకూడదని కోర్టు తేల్చి చెప్పింది. ప్రజల భద్రతే అన్నిటికంటే ముఖ్యమని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది.

**పిచ్చి కుక్కలకు కారుణ్య మరణం**

ఈ తీర్పులో మరో కీలకమైన అంశం 'కారుణ్య మరణం'. ప్రాణహాని కలిగించే పిచ్చి కుక్కలు లేదా అత్యంత ప్రమాదకరంగా మారి మనుషులపై దాడులు చేస్తున్న కుక్కలను చట్టబద్ధమైన పద్ధతుల్లో 'కారుణ్య మరణం' ప్రసాదించేందుకు అధికారులకు సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది. "ప్రజలు కుక్కకాటుకు గురవుతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోకూడదు. పౌరులకు గౌరవంగా, ఎలాంటి భయం లేకుండా జీవించే హక్కు ఉంది" అని ధర్మాసనం పేర్కొంది.

**ఆందోళనకరంగా గణాంకాలు**

తమిళనాడులో కేవలం నాలుగు నెలల్లో రెండు లక్షల కుక్క కాటు కేసులు నమోదు కావడం, రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్‌లో నెల రోజుల్లోనే వెయ్యికి పైగా కేసులు రావడంపై కోర్టు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. చిన్నారుల ముఖాలు కుక్కల దాడుల్లో ఛిద్రమవుతుంటే పాలన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం సరికాదని చురకలు అంటించింది. ఒకవేళ ఈ ఆదేశాలను పాటించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని కోర్టు హెచ్చరించింది. ఆదేశాలు ధిక్కరిస్తే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతారు. బాధ్యులైన అధికారుల నుంచి నష్టపరిహారం వసూలు చేస్తారు. ప్రభుత్వ యంత్రాంగంపై క్రమశిక్షణా చర్యలు ఉంటాయి. ప్రతి జిల్లాలో ఏబీసీ సెంటర్ తప్పనిసరి. కుక్కల జనాభాను అదుపు చేసే యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) నిబంధనలను రాష్ట్రాలు సరిగ్గా అమలు చేయడం లేదని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కేవలం నామమాత్రపు చర్యలతో కుదరదని, ప్రతి జిల్లాలో కనీసం ఒక పూర్తిస్థాయి ఏబీసీ సెంటర్ ఉండాలని ఆదేశించింది. అక్కడ అవసరమైన శిక్షణ పొందిన సిబ్బంది, వ్యాక్సినేషన్ సౌకర్యాలు ఉండాలి. అలాగే అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో యాంటీ రేబిస్ మందులు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేసింది.



**తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే..**

హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లో చిన్నారి ప్రదీప్‌పై కుక్కలు దాడి చేసి చంపిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ తర్వాత కూడా ఏపీ, తెలంగాణలో దాడులు ఆగలేదు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పు మున్సిపల్ అధికారులను పరుగులు పెట్టించనుంది. పౌరుల భద్రత కోసం తీసుకునే చర్యల్లో అధికారులకు రక్షణ ఉంటుందని, వారిపై అనవసరంగా కేసులు పెట్టకూడదని కూడా కోర్టు పేర్కొంది.

# మంత్రి పదవికి నేను సర్వథా అర్హుడిని

- మంత్రివర్గ విస్తరణ రేసులో నేనే ముందున్నా
- నాలుగు తరాలుగా కాంగ్రెస్ జెండా మోస్తున్నా.
- ఉమ్మడి రంగారెడ్డికి తగిన ప్రాధాన్యం దక్కాలి
- నమ్మకంతో ఉన్నాను.. అధిష్ఠానానిదే తుది నిర్ణయం.
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**పరిగి,మహా:** పరిగి శాసనసభ్యుడు రామ్మోహన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ విస్తరణపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో తనకు కచ్చితంగా చోటు దక్కుతుందన్న బలమైన ధీమాను ఆయన వ్యక్తపరిచారు. సీనియారిటీ పరంగా, సుదీర్ఘకాలంగా పార్టీకి చేసిన విశేష సేవల దృష్ట్యా తాను మంత్రి పదవికి అన్ని విధాలుగా నూటికి నూరు శాతం అర్హుడినని ఆయన స్పష్టం చేశారు. కేవలం ఆశించడమే కాకుండా, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వద్ద తన వాదనను, అర్హతలను బలంగా వినిపించినట్లు ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.



**నాలుగు తరాలుగా కాంగ్రెస్ జెండా మోస్తున్నాం**

తమ కుటుంబం దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నిబద్ధతతో పనిచేస్తోందని రామ్మోహన్ రెడ్డి గుర్తుచేశారు. నాలుగు తరాలుగా తమ కుటుంబ సభ్యులు కాంగ్రెస్ జెండాను మోస్తూ, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కూడా వెన్నంటే నిలిచారని ఆయన ప్రస్తావించారు. ఎన్నో రాజకీయ ఆటుపోట్లు, ప్రలోభాలు ఎదురైనప్పటికీ ఏనాడూ పార్టీని వీడలేదని, నిఖార్సయిన నాయకుడిగా ప్రజల్లో, పార్టీ శ్రేణుల్లో తనకు ప్రత్యేక గుర్తింపు ఉందని ఆయన పేర్కొన్నారు. దశాబ్దాలుగా పార్టీ విజయాల్లో తన వంతు క్రియాశీలక పాత్ర పోషించిన తనకు, ఈసారి ఏర్పడబోయే నూతన మంత్రివర్గంలో సముచిత స్థానం లభిస్తుందన్న అచంచలమైన ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

**రాహుల్ గాంధీ నుంచి సానుకూల స్పందన**

ఇటీవల దేశ రాజధాని ఢిల్లీ పర్యటనకు వెళ్లినప్పుడు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని స్వయంగా కలిసినట్లు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు. మంత్రివర్గ విస్తరణ ముంగిట తనకున్న సీనియారిటీ, అర్హతలను, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం కోసం చేసిన కృషిని ఆయనకు సవివరంగా వివరించానని చెప్పారు. చెప్పాల్సిన విషయాలన్నీ కుండబద్దలు కొట్టినట్లు అధిష్ఠానానికి తెలియజేశానని, తన అభ్యర్థన పట్ల రాహుల్ గాంధీ ఎంతో సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. పార్టీ కోసం నిస్వార్థంగా కష్టపడిన నాయకులను అధిష్ఠానం ఎప్పుడూ విస్మరించదని, ఈ దఫా తనకు కచ్చితంగా న్యాయం జరుగుతుందన్న స్పష్టమైన భరోసా లభించినట్లు ఆయన వ్యాఖ్యానించారు.

**ఉమ్మడి రంగారెడ్డికి తగిన ప్రాధాన్యం దక్కాలి**


గతంలో ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు క్యాబినెట్‌లో దక్కిన ప్రాధాన్యాన్ని, ప్రాతినిధ్యాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఒకప్పుడు ఈ రెండు కీలక జిల్లాల నుంచి ఏకంగా ఆరుగురు నేతలకు మంత్రివర్గంలో చోటు ఉండేదని ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర రాజకీయాల్లో, ఆర్థిక ప్రగతిలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా భౌగోళికంగా అత్యంత కీలకమైనదని, ఈ ప్రాంతానికి ప్రభుత్వంలో మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మారుతున్న రాజకీయ సమీకరణాల దృష్ట్యా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కోటాలో తనకు అవకాశం ఇవ్వడం అన్ని విధాలా సబబుగా ఉంటుందని ఆయన తన వాదనను బలంగా వినిపించారు.

**నమ్మకంతో ఉన్నాను.. అధిష్ఠానానిదే తుది నిర్ణయం**

రాబోయే మంత్రివర్గ విస్తరణలో తనకు బెర్త్ ఖాయమన్న నమ్మకంతో తాను ఉన్నానని రామ్మోహన్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఏళ్ల తరబడి తాను నమ్ముకున్న పార్టీ తన సేవలను గుర్తించి సరైన సమయంలో ఈ బాధ్యతను అప్పగిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఏది ఏమైనప్పటికీ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే తనకు శిరోధార్యమని, అధినాయకత్వం ఆదేశాలకు కట్టుబడి ఉంటానని ఆయన క్రమశిక్షణ కలిగిన నేతగా స్పష్టం చేశారు. మంత్రి పదవి వచ్చినా రాకున్నా పరిగి నియోజకవర్గ సమగ్రాభివృద్ధితో పాటు, ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు తన వంతు కృషి చేస్తూనే ఉంటానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# హైకోర్టు న్యాయమూర్తిపై ప్రచారం

- కేజ్రీవాల్ సహా ముగ్గురికి నోటీసులు
- కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించిన జస్టిస్ సూర్యకాంత శర్మ




**న్యూఢిల్లీ, మహా :** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మపై వ్యాఖ్యల కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మద్యం పాలసీ కేసు విచారణకు సంబంధించి జస్టిస్ స్వర్ణకాంత శర్మను ప్రణాళిక ప్రకారం సోషల్ మీడియాలో లక్ష్యంగా చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించి ముగ్గురికి కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసింది. జస్టిస్ స్వర్ణకాంత శర్మపై వ్యాఖ్యల కేసుపై జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ రవీందర్ దుడేజాలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. అనంతరం ముగ్గురికి కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోపు సమాధానం చెప్పాలని కోర్టు ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను ఆగస్టు 4వ తేదీకి వాయిదా వేసింది. మద్యం పాలసీ కేసును విచారిస్తున్న జస్టిస్ స్వర్ణకాంత శర్మను ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, వారి మద్దతుదారులు లక్ష్యంగా చేసుకున్నారు. సోషల్ మీడియాలో కొన్ని పోస్టులు, వీడియోలు పెట్టారు. ఓ విద్యాసంస్థలో జస్టిస్ స్వర్ణకాంత శర్మ మాట్లాడిన పాత వీడియోను ఎడిట్ చేసి, ఆమె ఓ రాజకీయ పార్టీకి అనుకూలంగా మాట్లాడుతున్నట్లుగా తప్పుగా ప్రచారం చేశారు. ఆమె ఈ కేసును నిష్పక్షపాతంగా విచారించలేరని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఆ ప్రచారంపై జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై దుష్ప్రచారం సాగించారనే ఆరోపణలపై గురువారం స్వచ్ఛందంగా కోర్టు ధిక్కరణ చర్యలను ప్రారంభించారు. అదే సమయంలో ఈ కేసు విచారణ నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించారు.

# సినిమా అవకాశాల పేరిట దారుణం

అనాథ యువతిపై సామూహిక అత్యాచారం.. గదిలో బంధించి రెండు రోజుల పాటు పైశాచికం
జూబ్లీహిల్స్ మెట్రో స్టేషన్ వద్ద తలదాచుకుంటున్న అభాగ్యురాళ్లపై వల
తీవ్ర గాయాలతో పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు.. నిందితుల కోసం గాలింపు

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ మహా నగరంలో మరో దారుణం వెలుగుచూసింది. సినిమా అవకాశాల పేరిట అమాయక యువతుల జీవితాలతో ఆడుకుంటున్న కీచకుల ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. తాజాగా జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఆశ్రయం పొందుతున్న ఓ అనాథ యువతిని సినీ పరిశ్రమలో అవకాశాలు ఇప్పిస్తామని నమ్మించి, రెండు రోజుల పాటు నిర్బంధించి సామూహిక అత్యాచారానికి పాల్పడిన అమానుష ఘటన నగరంలో కలకలం రేపుతోంది. ఒంటిపై తీవ్ర గాయాలతో నరకయాతన అనుభవించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

పోలీసులు, బాధితురాలు తెలిపిన ప్రాథమిక వివరాల ప్రకారం.. ఇద్దరు అనాథ యువతులు కొంతకాలంగా జూబ్లీహిల్స్ మెట్రో స్టేషన్ పరిసర ప్రాంతాల్లో తలదాచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఒంటరిగా, దిక్కుతోచని స్థితిలో ఉన్న వీరి దైన్యాన్ని గమనించిన కొందరు దుర్మార్గులు పక్కా ప్రణాళికతో వారిని లక్ష్యంగా చేసుకున్నారు. తాము సినీ రంగానికి చెందిన వారమని, సినిమాల్లో షూటింగ్స్, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా మంచి అవకాశాలు ఇప్పిస్తామని వారికి వల వేశారు. అనాథలైన ఆ యువతులు వారి మాయమాటలు నమ్మి మోసపోయారు. మెరుగైన జీవితం దొరుకుతుందన్న ఆశతో నిందితులు చెప్పిన మాటలను విశ్వసించారు.

పథకం ప్రకారం నిందితులు అభాగ్యురాలిని సికింద్రాబాద్‌లోని ఓ గదికి తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లిన తర్వాత కీచకులు తమ అసలు స్వరూపాన్ని బయటపెట్టారు. యువతిని ఆ గదిలో బంధించి, రెండు రోజుల పాటు



అత్యంత పాశవికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. బాధితురాలు ఎంత ప్రాధేయపడినా, కన్నీరుమున్నీరుగా విలపించినా కనికరించకుండా పైశాచిక ఆనందం పొందారు. అనంతరం ఈ నెల 16వ తేదీన ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ఒక ర్యాపిడో బైక్‌ను బుక్ చేసి, తీవ్ర గాయాలతో ఉన్న బాధితురాలిని అందులో ఎక్కించి అక్కడి నుంచి పంపించివేశారు. రెండు రోజుల పాటు జరిగిన అమానుష కాండలో బాధితురాలి ఒంటిపై తీవ్ర గాయాలయ్యాయి. ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడిన ఆ యువతి చివరకు ధైర్యం చేసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌ను చేరుకుని తనకు జరిగిన ఘోరమైన అన్యాయంపై ఫిర్యాదు చేసింది. బాధితురాలి దయనీయ పరిస్థితిని చూసిన పోలీసులు వెంటనే అప్రమత్తమై కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం యువతిని ఆసుపత్రికి తరలించారు. నిందితులు ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారు అనే కోణంలో మెట్రో స్టేషన్, సికింద్రాబాద్ పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు నిశితంగా పరిశీలిస్తున్నారు. కామాంధులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించినట్లు సమాచారం.

# బండికి బాసటగా కాంగ్రెస్ ఎంపీ

**బండి సంజయ్ రాజీనామా చేయాలనడం సరికాదు**
**సొంత పార్టీ ఎంపీలే ప్రయత్నిస్తున్నారన్న కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి**
**కవిత జైలుకు వెళ్ళినప్పుడు కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేశారా అని నిలదీత**

**హైదరాబాద్, మహా :** బండి సంజయ్‌ని కేంద్రమంత్రి పదవి నుంచి దించాలని, రాజీనామా చేయించాలని సొంత పార్టీ ఎంపీలే ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ మల్లు రవి అన్నారు. కానీ అది మంచి పద్ధతి కాదని అన్నారు. ఆయనను పదవిలో నుంచి దించేస్తే తాము వస్తామని కొందరు భావిస్తున్నారని ఆరోపించారు. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కుమారుడు బండి భగీరథ్ తప్పు చేస్తే బండి సంజయ్ మంత్రి పదవికి రాజీనామా చేయాలనడం సరికాదని అన్నారు. బండి సంజయ్ తన కుమారుడిని దాచిపెట్టకుండా చట్టానికి లొంగిపోయేలా చేసి బాధ్యతాయుతంగా వ్యవహరించారని కితాబిచ్చారు. మద్యం పాలసీ కేసులో కవిత జైలుకు వెళ్ళినప్పుడు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. ఇలాంటి అంశాల్లో పార్టీలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. పిల్లలు అన్నాక తప్పు చేస్తారని, కానీ దానిని రాజకీయం చేయడం సరికాదని అన్నారు. బండి సంజయ్ తన కుమారుడిని దాచిపెట్టకుండా సరెండర్ చేశారని గుర్తు చేశారు.

# గడువు కంటే ముందే నక్సలిజం అంతం

- భద్రతా బలగాల అలుపెరగని పోరాటం
- అభివృద్ధి జరగకపోవడానికి అసలు కారణం నక్సలిజమే
- బస్తర్ గడ్డపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా



**బస్తర్ (ఛత్తీస్‌గఢ్),మహా:** భద్రతా బలగాల అలుపెరగని పోరాటం, అసమాన ధైర్యసాహసాలు, వీరోచిత త్యాగాల ఫలితంగా దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా పారద్రోలినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సగర్వంగా ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ వేదికగా జరిగిన 26వ సెంట్రల్ రీజనల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన ఈ చరిత్రాత్మక ప్రకటన చేశారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలిస్తామని కేంద్ర ప్రభుత్వం గతంలో నిర్దేశించుకోగా, ఆ గడువు కంటే ముందే ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేశామని ఆయన స్పష్టం చేశారు.

**భయానక వాతావరణం నుంచి భరోసా వైపు బస్తర్ అడుగులు**

ఒకప్పుడు తుపాకుల మోతలు, మందుపాతరల పేలుళ్లతో దద్దరిల్లిన బస్తర్ ప్రాంతం నేడు నక్సల్స్ రహిత ప్రాంతంగా మారడం యావత్ దేశానికే గర్వకారణమని అమిత్ షా అభివర్ణించారు. ఈ విజయం వెనుక ఉన్న రాజకీయ, పరిపాలనాపరమైన అంశాలను కూడా ఆయన ప్రస్తావించారు. నక్సలిజాన్ని అంతం చేయడానికి కేంద్రం చేపట్టిన ఈ మహాయజ్ఞంలో అనేక కాంగ్రెసేతర, బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి మద్దతును అందించాయని, కానీ ఛత్తీస్‌గఢ్‌లో గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తమకు కనీస సహకారం కూడా అందించలేదని ఆయన ఆరోపించారు. అయితే, 2023 డిసెంబరు 13న విష్ణు దేవ్ సాయి నాయకత్వంలో ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని, మిగిలి ఉన్న నక్సలైట్లను కూడా ఏరివేసి బస్తర్ ప్రజలకు భద్రతను, భరోసాను కల్పించామని ఆయన వివరించారు. దశాబ్దాల చీకటి యుగం ముగిసిపోయి, ఎట్టకేలకు బస్తర్ స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటోందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

**అభివృద్ధి జరగకపోవడానికి అసలు కారణం నక్సలిజమే: అపోహలను బద్దలు కొట్టిన అమిత్ షా**

దశాబ్దాలుగా నక్సలిజానికి మద్దతుగా నిలుస్తున్న మేధావుల వాదనలను కేంద్ర హోంమంత్రి ఈ సభ వేదికగా తీవ్రంగా ఖండించారు. అభివృద్ధికి నోచుకోని ప్రాంతాల్లోనే నక్సలిజం ఉద్భవిస్తుందనే వాదన కేవలం ఒక అపోహ మాత్రమేనని, వాస్తవానికి ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి జరగకపోవడానికి ప్రధాన కారణం నక్సలిజమేనని ఆయన కుండబద్దలు కొట్టారు. దేశంలో బస్తర్ కంటే ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలు ఎన్నో ఉన్నాయని, కానీ అక్కడ నక్సలిజం పుట్టలేదని, ఆ ప్రాంతాలు క్రమంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని ఆయన ఉదాహరించారు. నక్సల్స్ ప్రాబల్యం, వారు సృష్టించిన అడ్డంకుల వల్లే బస్తర్ లాంటి ప్రాంతాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మిగిలిపోయాయని ఆయన స్పష్టం చేశారు.

**భద్రతా శిబిరాల నుంచి అభివృద్ధి కేంద్రాలుగా..**


నక్సలిజాన్ని సమూలంగా నిర్మూలించే దిశగా కేంద్ర హోం శాఖ వ్యూహాత్మకంగా అడుగులు వేసిందని, ఇందులో భాగంగానే బస్తర్ జిల్లా వ్యాప్తంగా సుమారు 200లకు పైగా భారీ భద్రతా శిబిరాలను ఏర్పాటు చేసిందని అమిత్ షా గుర్తు చేశారు. సీఆర్పీఎఫ్, డీఆర్జీ స్థానిక పోలీసు బలగాల సమన్వయంతో సాగిన ఈ ఆపరేషన్లు విజయవంతం కావడంతో, బస్తర్ పూర్తిగా శాంతియుత ప్రాంతంగా అవతరించిందన్నారు. బస్తర్ ప్రాంతంలో శాంతి నెలకొన్న నేపథ్యంలో, భద్రత కోసం ఏర్పాటు చేసిన ఈ శిబిరాలను పౌర సేవా కేంద్రాలుగా మార్చే బృహత్తర కార్యక్రమానికి కేంద్రం శ్రీకారం చుట్టింది.

ఇందులో తొలి దశగా, బస్తర్‌లోని 70 భద్రతా శిబిరాలను *'వీర్ షహీద్ గుండాధర్ సేవా డేరా'*లుగా మార్చుతున్నట్లు అమిత్ షా ప్రకటించారు. సోమవారం నాడు ఆయన లాంఛనంగా ప్రారంభించిన 'షహీద్ వీర్ గుండాధర్ సేవా డేరా జన సువిధా కేంద్రం' బస్తర్ ప్రజల పాలిట కల్పతరువుగా మారనుందని తెలిపారు. ఒకప్పుడు ఆయుధాలు పట్టిన బలగాలతో నిండిన ప్రదేశాలు, ఇప్పుడు ప్రజల జీవన ప్రమాణాలను పెంచే ఆశాకిరణాలుగా రూపాంతరం చెందాయి. ఈ సేవా కేంద్రాల ద్వారా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందిస్తున్న సుమారు 371 సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు ప్రజలందరికీ ఒకే గొడుగు కింద లభించనున్నాయి. రక్తపాతాన్ని పారద్రోలిన బస్తర్.. ఇప్పుడు సరికొత్త అభివృద్ధి ఉషోదయాన్ని ఆస్వాదిస్తోందని స్పష్టం చేస్తూ అమిత్ షా తన ప్రసంగాన్ని ముగించారు.

# టీడీపీ మహానాడు@ 2026

- 20 కీలక తీర్మానాలకు రంగం సిద్ధం
- తెలంగాణ నుంచి నాలుగు ప్రత్యేక ప్రతిపాదనలు
- ఎన్టీఆర్ భవన్‌లో తీర్మానాల కమిటీ కసరత్తు
- సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా పార్టీ వ్యూహాలు
- ఆర్థిక పరిస్థితులపై విస్తృత చర్చలు

**హైదరాబాద్, మహా:** తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'మహానాడు 2026' సమావేశాలపై పార్టీ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రెండు రోజుల పాటు అట్టహాసంగా సాగనున్న ఈ వేడుకలో దాదాపు 20 కీలక తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించాలని పార్టీ నాయకత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ దిశగా కసరత్తును ముమ్మరం చేసిన టీడీపీ.. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో తీర్మానాల కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సీనియర్ నేత యనమల రామకృష్ణుడు నేతృత్వంలోని 17 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ, మహానాడులో ప్రవేశపెట్టాల్సిన కీలక అంశాలపై సుదీర్ఘంగా, విస్తృతంగా చర్చలు జరిపింది. రాష్ట్ర రాజకీయ, భవిష్యత్ కార్యాచరణను నిర్దేశించే ఈ మహానాడులో పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జన్మదిన వేడుకల ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, పార్టీ సంస్థాగత బలోపేతం, యువతకు రాజకీయాల్లో ప్రోత్సాహం వంటి కీలక అంశాలపై ఉమ్మడి తీర్మానాలను ప్రవేశపెట్టాలని కమిటీ ప్రాథమికంగా నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, ఆర్థిక పరిణామాలపై ఈ వేదికపై లోతైన చర్చలు జరగనున్నాయి. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'సూపర్ సిక్స్' పథకాల పురోగతి, కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న మద్దతుతో పాటు, పశ్చిమాసియా యుద్ధం వంటి అంతర్జాతీయ పరిణామాల వల్ల రాష్ట్రంపై పడుతున్న ఆర్థిక భారంపై ప్రత్యేకంగా చర్చించనున్నారు. అంతేకాకుండా, ప్రతిపక్షాలు చేస్తున్న విధ్వంసక రాజకీయాలు, రాష్ట్ర అభివృద్ధికి వారు సృష్టిస్తున్న అడ్డంకులను ప్రజల దృష్టికి తీసుకెళ్లేలా ప్రత్యేక తీర్మానాలను రూపొందించాలని తీర్మానాల కమిటీ భావిస్తోంది. మహానాడు ముగింపు సందర్భంగా కీలకమైన రాజకీయ తీర్మానాన్ని ఆమోదించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.



ఈ దఫా మహానాడులో ఆంధ్రప్రదేశ్ తో పాటు తెలంగాణ రాష్ట్రంపై కూడా టీడీపీ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి సారించింది. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి మహానాడులో నాలుగు ప్రత్యేక తీర్మానాలను తీసుకురావాలని కమిటీలో చర్చించినట్లు విశ్వసనీయ సమాచారం. తెలంగాణలో మళ్లీ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడం, సరికొత్త రాజకీయ వ్యూహాలను రచించడం, ముఖ్యంగా యువతను పెద్దఎత్తున పార్టీ వైపు ఆకర్షించడం వంటి అంశాలు ఈ నాలుగు తీర్మానాల్లో ప్రధానంగా ఉండనున్నాయి. మహానాడు నిర్వహణ, ఈ తీర్మానాల తుది ముసాయిదా రూపకల్పన కోసం తీర్మానాల కమిటీ త్వరలోనే మరోసారి సమావేశం కానుంది. అనంతరం ఎల్లుండి జరగబోయే టీడీపీ అత్యున్నత నిర్ణాయక మండలి 'పొలిట్ బ్యూరో' సమావేశంలో ఈ తీర్మానాల వివరాలను పార్టీ అధిష్ఠానానికి సమర్పించి, తుది ఆమోదం పొందనున్నట్లు సమాచారం. ఈ మహానాడు రెండు రాష్ట్రాల పార్టీ క్యాడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపనుందని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి.

# గోమతి నగర్ రైలులో దారుణ ఘటన



- యువతిని ముక్కలుగా నరికి పెట్టెలో దాచారు
- లఖ్ నవూ రైల్వే స్టేషన్ లో వెలుగు చూసిన ఘటన

**లఖ్ నవూ, మహా :** బీహార్ నుంచి ఉత్తరప్రదేశ్ వెళ్లే ఒక ఎక్స్‌ప్రెస్ రైలులో అత్యంత దారుణమైన ఘటన వెలుగుచూసింది. ఒక యువతిని కిరాతకంగా హత్య చేసి, ఆమె శరీర భాగాలను ముక్కలుగా నరికి గోనె సంచిలో చుట్టి ఇనుప పెట్టెలో దాచారు. ఈ ఘటన ప్రయాణికులను, రైల్వే సిబ్బందిని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. బీహార్‌లోని ఛప్రా నుంచి గోరఖ్‌పూర్ మీదుగా లఖ్‌నవూ (గోమతి నగర్) వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు లఖ్‌నవూ స్టేషన్‌కు చేరుకుంది. ప్రయాణికులంతా దిగిపోయిన తర్వాత రైల్వే సిబ్బంది 'ఎస్1' స్లీపర్ కోచ్‌లో సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా, ఒక ఇనుప పెట్టె, ఒక సంచిని గమనించారు. ఎంతసేపటికీ ఆ పెట్టెను తీసుకునేందుకు ఎవరూ రాకపోవడంతో అనుమానం వచ్చిన సిబ్బంది వెంటనే స్టేషన్ మాస్టర్‌ను అప్రమత్తం చేశారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. లఖ్‌నవూ కమిషనరేట్ నుంచి వచ్చిన ఫోరెన్సిక్ బృందం సమక్షంలో పోలీసులు ఆ ఇనుప పెట్టెను, సంచిని తెరిచి చూడగా అక్కడ ఉన్నవారంతా ఒక్కసారిగా హడలిపోయారు. ఇనుప పెట్టెలోని ఒక ప్లాస్టిక్ కవర్‌లో యువతి మొండెం లభ్యమవగా, పక్కనే ఉన్న వేరొక సంచిలో చేతులు, కాళ్లు విడివిడిగా ప్యాక్ చేసి ఉన్నాయి. అయితే, మృతదేహానికి సంబంధించిన 'తల' మాత్రం అక్కడ లభించలేదు. మృతురాలి వయసు సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని ఫోరెన్సిక్ నిపుణులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. యువతిని ఎక్కడో దారుణంగా హత్య చేసి, ఆధారాలు లభించకుండా ఉండేందుకే దుండగులు శరీర భాగాలను ముక్కలుగా నరికి.. ఇలా పెట్టెలో, కవర్‌లో ఉంచి రైలులో వదిలేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ అమానుష ఘటనపై కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. మృతురాలు ఎవరు, ఆమెను అంత దారుణంగా చంపిన కిరాతకులు ఎవరు అనే విషయాలను కనుగొనేందుకు ఛప్రా, గోరఖ్‌పూర్, లఖ్‌నవూ స్టేషన్లలోని సీసీటీవీ ఫుటేజీలను నిశితంగా పరిశీలిస్తున్నారు.





# డ్రాగన్ గ్లింప్స్ రిలీజ్..

## ఎన్టీఆర్ ఫ్యాన్స్ కి పవర్‌ఫుల్ ట్రీట్

మ్యాన్ ఆఫ్ మాసెస్ జూ.ఎన్టీఆర్ హీరోగా, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న డ్రాగన్ సినిమా గ్లింప్స్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. మే 20వ తేదీ జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్ మొత్తం సినిమా కంటెంట్ ఎలా ఉండబోతోందనే క్లారిటీ ఇచ్చేసినట్లు అయింది. 'సలార్', 'కేజీఎఫ్' లాంటి భారీ సినిమాలతో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న ప్రశాంత్ నీల్, తన మార్క్ ఏమాత్రం తగ్గకుండానే ఈ గ్లింప్స్ కట్ చేశాడు.ఇక తారక్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం రాత్రి 11.30 గంటల తర్వాత డ్రాగన్ సినిమా గ్లింప్స్ వచ్చింది. 4.28 నిమిషాల నిడివి గల ఈ గ్లింప్స్‌లో ఎన్టీఆర్ స్లిమ్ లుక్ ఆకట్టుకుంది. సింపుల్‌గా సినిమా కథ, ఆ ప్రపంచంలోని పాత్రలను పరిచయం చేశారు. ఈ గ్లింప్స్‌లో తారక్ చెప్పిన డైలాగ్స్ అభిమానులను అలరించేలా ఉన్నాయి. విజువల్స్ చాలా రిచ్‌గా ఉన్నాయి. రవి బస్రూర్ అందించిన నేపథ్య సంగీతం ఫ్యాన్స్ అంచనాలను మరింత పెంచేలా ఉన్నాయి. పవర్‌ఫుల్‌గా సాగిన ఈ గ్లింప్స్ సినిమా మీద భారీ అంచనాలను రేపుతోంది.కాగా డ్రాగన్ సినిమా ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. కానీ షూటింగ్ షెడ్యూల్‌లు వరుసగా వాయిదాలు పడటంతో సినిమా రిలీజ్ కూడా వాయిదా పడ్డ విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానున్నట్టు డ్రాగన్ టీమ్ అధికారికంగా ప్రకటించింది. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఓ కీలకమైన పాత్రలో అనిల్ కపూర్ నటిస్తున్నారు.

కథను మలుపు తిప్పే మరో లీడ్ రోల్‌లో నటించనున్నారంటూ శ్రుతీహాసన్, రష్మికా మందన్నా, కాజోల్... వంటి వార్ల పేర్లు వినిపించాయి. తాజాగా ఆలియా భట్ పేరు తెరపైకి వచ్చింది. కాగా.. ఈ చిత్రాన్ని నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ యేర్నేని, వై. రవిశంకర్, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. తాజాగా విడుదల చేసిన వీడియో గ్లింప్స్‌ను మీరు కూడా చూసేయండి.

# తమిళ భాష నేర్చుకుంటున్నాను

హీరో, హీరోయిన్లు వివిధ భాషల్లో సినిమాలు చేస్తుంటారు. ఆయా భాషల్లో తమ పాత్ర తాలూకు భావోద్వేగాలు అర్థం చేసుకునేందుకు, సొంతంగా డబ్బింగ్ చెప్పుకునేందుకు ఆ భాషలు నేర్చుకుంటుంటారు. తాజాగా హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే తమిళ్ నేర్చుకుంటున్నారు. రవితేజ హీరోగా నటించిన 'మిస్టర్ బచ్చన్' (2024) సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు భాగ్యశ్రీ. అందం, అభినయంతో ఆకట్టుకున్న ఈ బ్యూటీ ఆ తర్వాత 'కింగ్‌డమ్, ఆంధ్ర కింగ్ తాలూకా' వంటి తెలుగు చిత్రాల్లో నటించారు. దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి కీలక పాత్రలు పోషించిన 'కాంత' సినిమాతో తమిళ చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టారామె. ప్రస్తుతం తెలుగులో అఖిల్ సరసన 'లెనిన్' మూవీలో నటిస్తున్న భాగ్యశ్రీ 'సెయాన్' అనే మరో తమిళ్ సినిమాలో అవకాశం అందుకున్న సంగతి తెలిసిందే. శివ కార్తికేయన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. ఈ చిత్రంలో తన పాత్ర గురించి భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ– "ఈ చిత్రంలో నా పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంది. నటిగా నన్ను నేను నిరూపించుకునేలా ఉంటుంది. ప్రేక్షకుల పట్ల నిజాయితీగా ఉండాలంటే నటించే చిత్రాల భాషను నేర్చుకోవాలి. తెలుగులో 'కింగ్‌డమ్' చిత్రానికి నేనే డబ్బింగ్ చె□్పాను. ఇప్పుడు 'సెయాన్' కోసం తమిళ భాష నేర్చుకుంటున్నాను" అని భాగ్యశ్రీ బోర్సే పేర్కొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com